**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 81, పేజీలు - 08

శనివారం, సెప్టెంబర్ 19, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు

### - హైకోర్టు సంచలన తీర్పు

- 2024 ఏప్రిల్ 23 నుంచే అనర్హత వర్తింపు
- స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబట్టిన ధర్మాసనం
- బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం
- కాంగ్రెస్ తరపున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మాజీమంత్రి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు బిగ్ షాక్ తగిలింది.పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ సంచలన తీర్పు వెలువరించింది.ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎమ్మెల్యే దానం నాగేందర్ విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు తప్పుబట్టింది. అంతేకాదు స్పీకర్ ఉత్తర్వులపై స్టే విధించింది.తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో 2024 ఏప్రిల్ నుంచే ఆయన శాసనసభ్యుడిగా అనర్హతకు గురైనట్లు కోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రస్తుతం ఖాళీగా ఉందని సీజే ధర్మాసనం అభిప్రాయపడింది.

**బీఆర్ఎస్ నుంచి గెలుపు**

ఇకపోతే 2023 నవంబర్‌లో జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు.అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచారు. అనంతరం బీఆర్ఎస్‌కు అధికారికంగా రాజీనామా చేయకుండానే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి

2లో..

## మమత బెనర్జీ బిగ్ యూటర్న్

### - పోటీ నుంచి తప్పుకొన్న తృణమూల్



**కోల్కతా (ప్రశ్న న్యూస్)** జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, అస్సాం అసెంబ్లీ స్థానాల ఉపఎన్నికల బరి నుంచి తృణమూల్ కాంగ్రెస్ తప్పుకొంది. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించింది. ఆయా స్థానాల్లో జరిగే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపింది. ఈ విషయాన్ని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ స్వయంగా వెల్లడించారు. ప్రజాస్వామ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

2లో..

## 22ఏ భూములపై సర్కార్ హైలెవల్ కమిటీ!

### - సమస్యలకు చెక్ పెట్టేలా కీలక నిర్ణయం




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన, రాజకీయంగానూ వివాదాస్పదంగా ఉన్న 22ఏ నిషేధిత భూముల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ నిషేధిత భూముల జాబితాలో తలెత్తుతున్న వివాదాలను సమగ్రంగా పరిశీలించి పరిష్కరించేందుకు వీలుగా ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ సర్కారు ఉత్తర్వులు

2లో..

## ప్రతిభా కేంద్రాలుగా ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు

- ఏఐ స్కిల్స్ తప్పనిసరి
- నారా లోకేశ్ ఆదేశాలు




**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలను (ఏపీఆర్ఎస్) ప్రతిభావంతులను తయారుచేసే అత్యుత్తమ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా అంతర్జాతీయ

2లో..

## ఆంధ్రప్రదేశ్‌ను హార్డ్‌వేర్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దుతాం

### - సీఎం అధ్యక్షతన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను కీలకమైన హార్డ్‌వేర్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు తీర ప్రాంతం పొడవునా పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసేలా చూడాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 21వ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశమైంది. మొత్తం 28 పారిశ్రామిక ప్రతిపాదనలకు సంబంధించి రూ.22,177.84 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 19,739 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఇంధన రంగం, ఐటీ కమ్యూనికేషన్, ఫుడ్ ప్రాసెసింగ్, తయారీ, పర్యాటక రంగాలకు చెందిన వివిధ ప్రతిపాదనలపై చర్చించి ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఏపీని దేశంలోనే ప్రముఖ హార్డ్‌వేర్ తయారీ రాష్ట్రంగా అభివృద్ధి చేయాలని సమావేశంలో సీఎం స్పష్టం చేశారు. సెమీ కండక్టర్లు, చిప్ తయారీ, రోబోటిక్స్ తదితర ఆధునిక సాంకేతిక రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి వంటి ఎలక్ట్రానిక్స్ హబ్‌లలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

2లో..

## మిగిలిన ఎమ్మెల్యేలకు ఇదే గతి

### - దానం నాగేందర్‌పై అనర్హత వేటుపై కేటీఆర్ ట్వీట్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. దానం నాగేందర్ పార్టీ ఫిరాయింపుల పిటిషన్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సత్యమేవ జయతే అంటూ పోస్ట్ పెట్టారు. మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేలకు కూడా ఇదే పరిస్థితి ఎదురవుతుందని పేర్కొన్నారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచారు. ఆ తర్వాత ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ క్రమంలోనే ఆయనపై నమోదైన ఫిరాయింపులపై స్పీకర్ క్లీన్ చీట్ ఇచ్చినా బీఆర్ఎస్, బీజేపీ నేతలు హైకోర్టుకు ఎక్కడంతో తీర్పు దానం నాగేందర్‌కు వ్యతిరేకంగా వచ్చింది. ఈ పరిణామంపై స్పందించిన కేటీఆర్.. సత్యమేవ జయతే అంటూ తన ట్వీట్‌ను ప్రారంభించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం నాగేందర్ అనర్హతకు గురయ్యారని పేర్కొన్నారు. పార్టీ మారిన మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేలకు కూడా త్వరలో ఇదే గతి ఎదుర్కొంటారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇక దానం నాగేందర్ అనర్హత వేటు తీర్పు అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కూడా స్పందించారు. దానం నాగేందర్‌పై అనర్హత వేటు తమ పార్టీకి లభించిన విజయమని పేర్కొన్నారు. మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలోనూ న్యాయపోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

2లో..

## ఏళ్ల నిరీక్షణకు తెర

### - టీజీఎస్ఆర్టీసీలో ఎన్నికల నగారా

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో కార్మికులు, ఉద్యోగులు చాలాకాలంగా ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికలకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. దాదాపు 10 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆర్టీసీలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్‌ను కార్మిక శాఖ శుక్రవారం విడుదల చేసింది. ఈనెల 21వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుండగా అక్టోబర్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. అక్టోబర్ 17వ తేదీన ఫలితాలను ప్రకటించనున్నారు.ఆర్టీసీలో చివరిసారిగా 2016 జూలై 19వ తేదీన గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. వాస్తవానికి 2018లోనే తదుపరి ఎన్నికలు జరగాల్సి ఉన్నప్పటికీ.. అవి నిర్వహించలేదు. దీంతో గుర్తింపు సంఘం

2లో..

## యుద్ధం కొత్తేం కాదు, ఉపఎన్నికలకు రెడీ

### - అనర్హతపై దానం రియాక్షన్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేస్తూ తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఆయన చేసిన తాజా వ్యాఖ్యలు

2లో..

## సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం

### - కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బండి సంజయ్ తీవ్ర ధ్వజం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట భూముల వ్యవహారంపై తెలంగాణ రాజకీయం మరింత వేడెక్కింది. ఈ వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భూకబ్జాలకు సంబంధించి నిజంగా ఆధారాలు ఉంటే వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుని కేసీఆర్ కుటుంబంతో సహా బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి

2లో..

## స్పామ్ కాల్స్‌కు ఇక చెక్

### - రోబోకాల్స్‌పై ట్రాయ్ షాకింగ్ రూల్!




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** స్పామ్ కాల్స్, వాణిజ్య సందేశాలకు అడ్డుకట్ట వేసేందుకు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఆటోమేటెడ్ కాల్స్, వినియోగదారుల విచారణ ఆధారంగా చేసే ప్రచార కాల్స్‌పై ఆంక్షలను మరింత కఠినతరం చేసింది. ఒక వ్యక్తి ఏదైనా

2లో..

## మరో 15 రోజుల్లో తేలనున్న అగార్కర్ భవితవ్యం

### - క్లారిటీ ఇచ్చిన బీసీసీఐ కార్యదర్శి

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ భవిష్యత్తుపై నెలకొన్న ఉత్కంఠకు త్వరలో తెరపడనుంది. అగార్కర్ పదవీకాలంపై మరో 15 రోజుల్లోగా నిర్ణయం తీసుకుంటామని బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా స్పష్టం చేశారు. శుక్రవారం జరిగిన 95వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అజిత్ అగార్కర్ 2023 జులైలో చీఫ్ సెలక్టర్‌గా బాధ్యతలు చేపట్టాడు. అతడి పదవీకాలంలో భారత జట్టు అద్భుత విజయాలు సాధించింది. టీమిండియా 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు చేరడంతో పాటు, 2024 టీ20 ప్రపంచకప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ, స్వదేశంలో

2లో..

# ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు

కాంగ్రెస్ బీ-ఫారమ్ పోటీ చేయడం వివాదాస్పదమైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే మరొక పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని బీఆర్ఎస్ ఆరోపిస్తుంది.

### 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హత వేటు

బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డితోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్లపై సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. స్పీకర్ నిర్ణయంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపింది. అలాగే ఎమ్మెల్యేలు ఇచ్చిన ఆధారాలను సైతం పరిగణలోకి తీసుకున్న సీజే ధర్మాసనం వాదనలు ముగించింది. అయితే తీర్పును శుక్రవారం వెల్లడించింది. ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ నిర్ణయం తీసుకుంది. అంతేకాదు 2024 ఏప్రిల్ 23 నుంచి ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తున్నట్లు తెలిపింది. అంతేకాదు ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు స్పీకర్, ఈసీకి సైతం సీజేఐ ధర్మాసనం సమాచారం సైతం తెలియజేసింది.

### దానం తరపు న్యాయవాదుల విజ్ఞప్తి తిరస్కరణ

మరోవైపు అనర్హత వేటుపై ఎమ్మెల్యే దానం నాగేందర్ తరపు న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపించారు. ఇప్పటికిప్పుడు అనర్హతవేటు వేస్తే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని వాదించారు. సుప్రీంకోర్టును ఆశ్రయించే వరకు ఉత్తర్వులపై స్టే విధించాలని కోర్టును అభ్యర్థించారు. అయితే దానం నాగేందర్ తరపు న్యాయవాదుల విజ్ఞప్తిని సీజే ధర్మాసనం తిరస్కరించింది.

### కొంపముంచిన కాంగ్రెస్ బీ ఫామ్..

కేవలం ఫొటోలు, పేపర్ కథనాల ఆధారంగా ఫిరాయింపు జరిగినట్లు నిర్ధారించలేమని ఆయన బీఆర్ఎస్ లోనే కొనసాగుతున్నారని దానం నాగేందర్ పై వచ్చిన పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. అయితే దానంను ఎమ్మెల్యేగా డిస్ క్వాలిఫై చేయాలని మహేశ్వర్ రెడ్డి, కౌశిక్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లు విచారించిన హైకోర్టు దానం నాగేందర్ కాంగ్రెస్ బీ-ఫామ్‌పై పోటీ చేయడాన్ని కీలక ఆధారంగా తీసుకుని ఎమ్మెల్యేగా కొనసాగేందుకు అనర్హుడిగా తీర్పు వెలువరించింది. దానం కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలున్నాయి. సుప్రీంకోర్టులో కనుక అనుకూల తీర్పు రాకపోతే దానం అనర్హతతో త్వరలో ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు రానున్నాయి.

# మమత బెనర్జీ బిగ్ యూటర్న్

ఈ పరిణామాల నేపథ్యంలో నందిగ్రామ్ అసెంబ్లీ ఉపఎన్నిక బరి నుంచి తమ పార్టీ అభ్యర్థి సంచితా ప్రధాన్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్లు ఆమె అధికారికంగా వెల్లడించారు. అంతకుముందే సంచిత ప్రధాన్ రిటర్నింగ్ అధికారిని కలిసి తన నామినేషన్ పత్రాలను వెనక్కి తీసుకున్నారు కూడా. దేశంలో నిరంకుశ పోకడలకు అడ్డుకట్ట వేయాలంటే ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని మమతా బెనర్జీ తేల్చి చెప్పారు.పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగ నిబంధనలను తుంగలో తొక్కుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని తిప్పికొట్టడమే ధ్యేయంగా తాము ఉమ్మడిగా ముందడుగు వేసినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ప్రకటించడం ద్వారా బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా అడ్డుకోవచ్చని, తద్వారా లౌకిక శక్తులను బలోపేతం చేయడానికి మార్గం సుగమం అవుతుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. దేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై మమతా బెనర్జీ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని అధికార పక్షం అత్యున్నత రాజ్యాంగ పదవులను అగౌరవపరుస్తోందని, రాజకీయ కక్షసాధింపుల కోసం వినియోగించుకుంటోందని అన్నారు. దేశ ప్రజాస్వామ్య చరిత్రలో బ్లాక్ డే గా అభివర్ణించారు. ఒక రాజకీయ పార్టీ తన అహంకారాన్ని సంతృప్త పరచుకోవడం కోసమే ఇటువంటి ప్రజాస్వామ్య, చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడుతోందని, విపక్షాలను లక్ష్యంగా చేసుకుని ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. బీజేపీ దేశానికి అత్యంత ప్రమాదకరంగా మారిందని మమత బెనర్జీ ఆరోపించారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రశ్నించే జర్నలిస్టులను కూడా వదలట్లేదని, అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారని మండిపడ్డారు. బీహార్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, పశ్చిమ బెంగాల్ లల్లో ఎన్నికల ప్రక్రియ అపహాస్యానికి గురైందని, కేంద్రం ఓట్లను లూటీ చేసిందని ఆరోపించారు. అధికారంలో ఉన్నవారు శాశ్వతం కాదనే సత్యాన్ని గ్రహించాలని హెచ్చరించారు.

# ప్రతిభా కేంద్రాలుగా ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు

ప్రమాణాలను నెలకొల్పాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం ఆయన అధ్యక్షతన ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ 59వ గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రెసిడెన్షియల్ విద్యావ్యవస్థను సమూలంగా బలోపేతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, “ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు అకడమిక్ ఎక్సలెన్స్‌పై దృష్టి సారించి, ప్రతిభావంతులను తయారు చేసే కేంద్రాలుగా మారాలి” అని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తొలిసారిగా పత్రికా ప్రకటనల ద్వారా అభినందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పటివరకు రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివిన వారిలో 27 మంది ఐఏఎస్‌లు, 20 మంది ఐపీఎస్‌లు, 13 మంది ఐఆర్ఎస్‌లు, నలుగురు ఐఎఫ్ఎస్‌లతో పాటు ఎందరో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని అధికారులు వివరించగా, మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు.

**కీలక నిర్ణయాలు ఇవే..** టెక్నాలజీలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో నైపుణ్య శిక్షణను తప్పనిసరి చేయాలని, అన్ని స్కూళ్లలో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 10 ఏపీఆర్ విద్యాసంస్థలను ‘సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్’లుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇప్పటికే తాడికొండ, కొడిగినహళ్లి పాఠశాలలు ఈ జాబితాలో ఉన్నాయి. కృష్ణా జిల్లా నిమ్మకూరులోని ఏపీఆర్ జూనియర్ కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఐఐటీ-జేఈఈ/నీట్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరో 6 రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు కూడా సమావేశం ఆమోదముద్ర వేసింది.

**సిబ్బంది సంక్షేమం, మౌలిక వసతులపై దృష్టి** సిబ్బంది సంక్షేమానికి సంబంధించి కూడా పలు ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. ఏపీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సిబ్బంది పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. గెస్ట్ ఫ్యాకల్టీ గౌరవ వేతనాలను ఇతర సొసైటీలతో సమానంగా పెంచడంతో పాటు, పీఈటీలను పీడీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు అంగీకరించింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది నియామకాలకు స్టాఫింగ్ ప్యాటర్న్‌కు ఆమోదం తెలిపారు.అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లలో శాశ్వత భవనాలు, మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని, ఆటోమేటెడ్ స్మార్ట్ కిచెన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. విద్యార్థుల వైద్య అత్యవసర పరిస్థితుల కోసం లక్ష రూపాయల వరకు ఖర్చు చేసే అధికారాన్ని సొసైటీ సెక్రటరీకి కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. జగ్గంపేట నియోజకవర్గంలోని భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రపంచస్థాయి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే అవకాశాలను పరిశీలించాలని లోకేశ్ ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జే. శ్యామలరావు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ రంజిత్ బాషా, ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా, ఏపీఆర్ఈఐఎస్ కార్యదర్శి కృష్ణమోహన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మరో 15 రోజుల్లో తేలనున్న అగార్కర్ భవితవ్యం

ఈ ఏడాది జరిగిన టీ20 ప్రపంచకప్ టైటిళ్లను గెలుచుకుంది. అక్టోబర్ 4తో అగార్కర్ పదవీకాలం ముగియనుండగా, 2027 వన్డే ప్రపంచకప్‌కు జట్టు సన్నద్ధమవుతున్న తరుణంలో బీసీసీఐ ఈ అంశంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీనిపై సైకియా మాట్లాడుతూ “ఈ రోజు సమావేశంలో ఏ ఒక్క వ్యక్తి గురించీ చర్చ జరగలేదు. ఇంకా 15 రోజుల సమయం ఉంది. తగిన సమయంలో నిర్ణయం తీసుకుని, మీకు తెలియజేస్తాం” అని వివరించారు.

**అంపైర్లకు, రిఫరీలకు తీపికబురు** ఈ సమావేశంలో దేశవాళీ అంపైర్లు, మ్యాచ్ రిఫరీల ఫీజులను భారీగా పెంచుతూ బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. 2017-18 సీజన్ తర్వాత ఫీజులను పెంచడం ఇదే ప్రథమం. గతంలో ఉన్న ఏం, ఏ, బి, సి కేటగిరీల స్థానంలో ఇప్పుడు ఏ, బీ, సీ, డి అనే కొత్త నిర్మాణాన్ని తీసుకొచ్చినట్లు సైకియా తెలిపారు.

దీని ద్వారా వారి రోజువారీ ఫీజులు గణనీయంగా పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, మ్యాచ్ అధికారుల్లో జవాబుదారీతనం పెంచేందుకు మెరిట్ ఆధారిత ప్రమోషన్లు, డిమోషన్ల విధానాన్ని కూడా ప్రవేశపెట్టారు. “ప్రతిభ కనబరిచిన పది మంది అంపైర్లను పైస్థాయికి ప్రమోట్ చేస్తాం. అదే సమయంలో, ఉన్నత స్థాయిలో ఉండి సరిగా రాణించని పది మందిని కింది స్థాయికి డిమోట్ చేస్తాం” అని సైకియా స్పష్టం చేశారు.

**ఇతర కీలక అంశాలు** బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా రాంచీలో జరగాల్సిన టెస్టు వేదిక మార్పుపై వస్తున్న వదంతులను సైకియా ఖండించారు. “ఆ టెస్టుకు ఇంకా ఆరు నెలల సమయం ఉంది. వేదిక మార్పుపై మాకు ఎలాంటి అభ్యర్థనలు రాలేదు” అని ఆయన తెలిపారు. అలాగే, జూనియర్ సెలక్షన్ కమిటీ కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని, క్రికెట్ సలహా కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహించిన తర్వాత 10-15 రోజుల్లో కొత్త కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. కేంద్ర క్రీడల చట్టంపై మాట్లాడుతూ క్రీడా మంత్రిత్వ శాఖ నుంచి అధికారిక నోటిఫికేషన్ వచ్చాకే తదుపరి చర్యలు ఉంటాయని, అక్టోబర్ 27న సుప్రీంకోర్టులో దీనిపై వివరణ ఇస్తామని సైకియా వెల్లడించారు.

# ఆంధ్రప్రదేశ్‌ను హార్డ్‌వేర్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దుతాం

కేవలం ఎలక్ట్రానిక్స్ తయారీతో ఆగకుండా పరిశోధన, డిజైన్ల రూపకల్పన మాన్యుఫ్యాక్చరింగ్‌తో పూర్తి స్థాయి ఎకోసిస్టమ్ ఏర్పాటు చేయాలని అన్నారు. సోలార్ ప్యానళ్ల తయారీతో పాటు వాటికి అవసరమైన అనుబంధ పరిశ్రమలు, సాంకేతికత, నైపుణ్యాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. క్వాంటమ్ టెక్నాలజీ, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ వంటి అత్యాధునిక రంగాల్లో పరిశోధన, తయారీ సంస్థలు వేగంగా ఏర్పాటయ్యేలా చూడాలని అధికారులకు సీఎం సూచించారు. డ్రోన్, స్పేస్ సిటీల సమీపంలో ఆయా రంగాలకు అనుబంధంగా ఉండే క్లస్టర్ పరిశ్రమలు ఏర్పడేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు.

### ఫిషింగ్ హార్బర్లను కూడా అభివృద్ధి చేయాలి

రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ తయారీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసేందుకు తైవాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా తెలిపారు. పెట్టుబడులకు ఆమోదం తెలిపిన తర్వాత ప్రాజెక్టులు కేవలం త్వరితగతిన ఉత్పత్తి ప్రారంభించేలా పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ప్రతి ప్రాజెక్టుకు 6 నెలల గడువు విధించి, ఆ వ్యవధిలోగా పనులు ప్రారంభమయ్యేలా చూడాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని పోర్టుల వద్ద ఉన్న భూమిని వాణిజ్యపరంగా సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు. పోర్టుల అభివృద్ధితో పాటు వాటి చుట్టూ లాజిస్టిక్స్, షిప్ బిల్డింగ్, గోదాములు, తయారీ పరిశ్రమలు, అనుబంధ పరిశ్రమలు అభివృద్ధి చెందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఫిషింగ్ హార్బర్లను కూడా అభివృద్ధి చేయాలన్నారు. కార్గో షిప్‌ల నిర్మాణంతో పాటు డిఫెన్స్, టూరిజం అవసరాలకు అనుగుణంగా షిప్‌బిల్డింగ్ కార్యకలాపాలను రాష్ట్రంలో అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

### లాజిస్టిక్స్ హబ్‌గా ఏపీ

పోర్టులు-షిప్‌బిల్డింగ్-లాజిస్టిక్స్-పరిశ్రమలను అనుసంధానించే సమగ్ర ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. లాజిస్టిక్స్ రంగంపై విస్తృతంగా పనిచేయాలని సీఎం అధికారులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌ను లాజిస్టిక్స్ హబ్‌గా అభివృద్ధి చేయాలని అన్నారు. పోర్టులు, రైలు, రోడ్డు, ఎయిర్ కార్గో, అంతర్గత జల రవాణా వంటి అన్ని రవాణా మార్గాలను అనుసంధానం చేసి సమగ్ర లాజిస్టిక్స్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. శ్రీసిటీ తో తిరుపతి జిల్లా ఎగుమతుల్లో దేశంలోనే 10వ స్థానంలో నిలిచిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా 12 స్థానంలో ఉందని ఎగుమతుల్లో టాప్-5లోకి తీసుకురావాలని సీఎం సూచించారు. రాష్ట్ర యువత నైపుణ్యాల్లో అగ్రస్థానంలో ఉండాలని సీఎం అన్నారు. 10వ తరగతి నుంచే స్కిల్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించాలని సూచించారు. దీనిపై స్కిల్ మ్యాపింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పీఎం సేతును కూడా అనుసంధానం చేసుకుంటూ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. విశాఖపట్నంలోని అదానీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నైపుణ్య శిక్షణతో పాటు సివిల్ ఏవియేషన్ సహా ఎంఆర్వో ఫెసిలిటీని కూడా అభివృద్ధి చేస్తున్న విషయాన్ని సమావేశంలో ప్రస్తావించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించేందుకు ఇలాంటి అవకాశాలను విస్తరించాలని సూచించారు. మెటీరియల్ రీసెర్చ్‌లో కూడా అత్యంత కీలకంగా నైపుణ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. భవిష్యత్ తయారీ పరిశ్రమలకు అవసరమైన పరిశోధన, సాంకేతిక నైపుణ్యాలు, మానవ వనరులను అభివృద్ధి చేయాలని సూచించారు. సిమెంట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు కొన్ని సిమెంట్ కంపెనీలు ముందుకు వచ్చినట్లు సమావేశంలో అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో మహిళా పారిశ్రామికవేత్తలకు ఉన్న అవకాశాలు, ప్రస్తుతం వారు నిర్వహిస్తున్న వ్యాపారాలు, ఎదుర్కొంటున్న సవాళ్లు, ఇతర రాష్ట్రాల్లో అమలు అవుతున్న విధానాలను పరిశీలించి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అగ్రి-బేస్డ్ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో కూడా మహిళలు మరింతగా పరిశ్రమలు ఏర్పాటు చేసే అవకాశం ఉందని సీఎం అన్నారు. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలు విస్తృతమయ్యేలా ‘వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్’ విధానాన్ని ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

### రేర్ ఎర్త్ మినరల్స్ పై ప్రత్యేక దృష్టి

రేర్ ఎర్త్ మినరల్స్ విషయంలో ఆంధ్రప్రదేశ్‌ను హబ్‌గా తయారు చేసే అవకాశాలను కూడా పరిశీలించాలని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రేర్ ఎర్త్ మినరల్స్ ఆధారిత ప్రాసెసింగ్, విలువ ఆధారిత పరిశ్రమలు, పరిశోధన, తయారీ రంగాలను అనుసంధానం చేసే దిశగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. టీటీడీ పరిధిలోని భవనాలపై సౌర, పవన విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వంటి ప్రత్యామ్నాయాల వైపు మళ్లాలని సూచించారు. టీటీడీలో నెట్‌జీరో లక్ష్యాన్ని సాధించే దిశగా చర్యలు చేపట్టాలని, ఎలక్ట్రిక్ బస్సులు, చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 511 చార్జింగ్ స్టేషన్లకు అనుమతులు ఇచ్చినట్లు సమావేశంలో వెల్లడించారు. ఆన్‌షోర్ విండ్ మిల్స్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవకాశాలను కూడా పరిశీలించాలని సీఎం సూచించారు. గ్రీన్ ఎనర్జీలో రాష్ట్రం నిర్దేశించుకున్న 160 గిగావాట్ల లక్ష్యానికి గాను ఇప్పటికే 113,75 గిగావాట్లకు సంబంధించి పెట్టుబడులు సాధించినట్టు అధికారులు వివరించారు.

డిసెంబర్ 17, 18 తేదీల్లో ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో హైడ్రోజన్ వ్యాలీ సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నవంబర్‌లో జరిగే భాగస్వామ్య సదస్సు సందర్భంగా పెట్టుబడిదారులకు అందించే ప్రోత్సాహకాల కోసం ఎస్క్రో ఖాతాల ఏర్పాటుపై చర్యలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఆతిథ్య రంగంలో హోటళ్లు పెద్దఎత్తున ఏర్పాటయ్యేలా చూడాలని సీఎం సూచించారు. ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్ సంస్థలు వచ్చేలా ఆహ్వానించాలన్నారు. విశాఖలో భాగస్వామ్య సదస్సుకు మరో 50 రోజులు సమయమే ఉందని అప్పటికల్లా గతంలో కుదిరిన ఒప్పందాలు గ్రౌండ్ అయ్యేలా చూడాలన్నారు. ఇప్పటివరకు జరిగిన 21 ఎస్ఐపీబీ సమావేశాల్లో మొత్తం 387 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా రూ.14.05 లక్షల కోట్ల పెట్టుబడులు, 10.79 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉంది. ఎస్ఐపీబీ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, పి.నారాయణ, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాష్, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధన్ రెడ్డి, సీఎస్ సాయి ప్రసాద్‌తో పాటు పరిశ్రమలు, ఐటీ, ఐ అండ్ ఐ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# 22ఏ భూములపై సర్కార్ హైలెవల్ కమిటీ!

జారీ చేసింది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

### హైలెవెల్ కమిటీ ఛైర్మన్, సభ్యులు వీరే

ఈ మేరకు ముగ్గురు సీనియర్ అధికారులతో కూడిన కమిటీని నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా జీవో జారీ చేసింది. ఈ హైలెవెల్ కమిటీకి సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ ఛైర్మన్‌గా వ్యవహరించనుండగా, సభ్యులుగా అధికారులు పాపిరెడ్డి, రాజీవ్ గాంధీ హనుమంతు బాధ్యతలు నిర్వర్తిస్తారు. భూ బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు ఈ కమిటీ త్వరలోనే విధివిధానాలు ఖరారు చేయనుంది.

### ధరణి పోర్టల్ ద్వారా విదేశీయుల చేతుల్లోకి మన భూముల లెక్కలు

తెలంగాణలో అటవీ, అసైన్డ్, దేవాదాయ శాఖలకు చెందిన 1 కోటి 2 లక్షల ఎకరాలు 22ఏ నిషేధిత జాబితాలోనే ఉంటాయని, వీటిని తొలగించే అధికారం మంత్రులకు కూడా లేదని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల సభలోనే స్పష్టం చేశారు. నిజాం కాలం నాటి భూ సమస్యలపై చర్చ జరగాలని అభిప్రాయపడిన ఆయన, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ధరణి పోర్టల్ ద్వారా 2.50 కోట్ల ఎకరాల భూముల వివరాలు విదేశీ మాఫియా చేతికి వెళ్లాయని, మన రైతుల భూముల వివరాలు విదేశీయుల వద్ద ఉన్నాయని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయడం, అధికారుల పొరపాట్ల వల్ల ప్రైవేట్ భూములు 22ఏలో చేరడం వల్ల వివాదాలు ముదిరాయని పేర్కొన్నారు.

### కల్వకుంట్ల కుటుంబం ఆస్తులపై రేవంత్ రెడ్డి కామెంట్స్

22ఏ జాబితాలో 12 అంశాలను గుర్తించామని, సభ్యుల సూచనలతో పేదలకు న్యాయం చేస్తామన్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, ఈ భూసమస్య పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ రెడ్డి వివరించారు. ఇదే సమయంలో తెలంగాణ ఉద్యమకారులు సర్వస్వం కోల్పోతే, కేసీఆర్ కుటుంబం మాత్రం వేల కోట్లు, వందల ఎకరాలు సంపాదించిందని సీఎం రేవంత్ మండిపడ్డారు.కల్వకుంట్ల కుటుంబం, వారి బంధువుల పేరిట 9 జిల్లాల పరిధిలో ఉన్న 439.30 ఎకరాల భూముల వివరాలను సర్వే నంబర్లతో సహా సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా వెల్లడించారు. కేసీఆర్ సహా కుటుంబసభ్యులకు ఎవరి పేరిట ఎన్ని ఎకరాల భూములు ఉన్నాయి, ఎక్కడెక్కడ ఉన్నాయో కూడా అసెంబ్లీలో చదివి వినిపించారు. ముఖ్యంగా కేసీఆర్ ఎర్రవల్లి ఫాం హౌస్ భూమిలో ప్రభుత్వ భూములతో పాటు రైతుల నుంచి లాక్కున్న భూములు ఉన్నాయని, దీనిపై 30 రోజుల్లో విచారణ జరిపించి నివేదిక సమర్పించాలని సిద్దిపేట కలెక్టర్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి కుటుంబం పేరిగ సైతం వందల ఎకరాల భూములు ఉన్నాయని, త్వరలోనే అన్ని లెక్కలు ప్రజల ముందు ఉంచుతామని కేటీఆర్, హరీష్ రావు అన్నారు.

# స్పామ్ కాల్స్‌కు ఇక చెక్

ఉత్పత్తి లేదా సేవ గురించి కంపెనీని సంప్రదిస్తే ఆ విచారణ ఆధారంగా వాణిజ్య సందేశాలు లేదా కాల్స్ ఏడు రోజుల వరకే చేసేందుకు అనుమతి ఉంటుంది.

ఆ తర్వాత అదే విచారణను ఆధారంగా చేసుకుని ప్రచార కమ్యూనికేషన్ చేయడానికి వీలుండదు.ఇక ముందుగా రికార్డు చేసిన వాయిస్‌తో చేసే ఆటోమేటెడ్ లేదా రోబోకాల్స్‌కు ‘ప్రీ-డిక్లరేషన్’ తప్పనిసరి చేసింది ట్రాయ్. ఈ డిక్లరేషన్ లేకుండా ఆటోమేటెడ్ సిస్టమ్ ద్వారా చేసే కాల్స్‌ను స్పామ్‌గా పరిగణిస్తారు. అనుమతి లేని ఆటోమేటెడ్ కాల్స్‌ను నిరుత్సాహపరిచేందుకు ఒక్కో కాల్‌కు 5 పైసల టెర్మినేషన్ ఛార్జీ విధించాలని నిర్ణయించింది.

దీంతో వాణిజ్య అవసరాల కోసం ఆటోమేటెడ్ కాలింగ్ సిస్టమ్స్‌ను దుర్వినియోగం చేయకుండా అడ్డుకట్ట వేయాలని ట్రాయ్ భావిస్తోంది. లావాదేవీలు, సేవలకు సంబంధించిన కాల్స్ కోసం 1601 సిరీస్ నంబర్లను ఇతర రంగాలకు విస్తరించే ప్రక్రియను ట్రాయ్ ప్రారంభించింది. తొలి దశలో విద్యుత్ పంపిణీ సంస్థలు, నీటి సరఫరా సంస్థలు, సిటీ గ్యాస్ సంస్థలు, ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు సహా యుటిలిటీ సేవల సంస్థలకు ఈ నంబర్లను కేటాయించనున్నారు. దీంతో సాధారణ 10 అంకెల మొబైల్ నంబర్ల నుంచి వచ్చే నకిలీ కాల్స్, మోసాలను గుర్తించడం వినియోగదారులకు సులభం కానుంది.

# సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం

ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ ఈ డ్రామాలకు తెరలేపిందని, కేసీఆర్‌తో లాలూచీ పడేందుకే అసెంబ్లీలో ప్రత్యేక విచారణ కమిషన్ వేశారా అని ఎద్దేవా చేశారు.

కేసీఆర్ గతమంతా అక్రమాలు, అవినీతి, భూదందాలతోనే నిండిపోయిందని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల యజమాని కాదనే విషయం స్పష్టమవుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకే బాటలో పయనిస్తూ పరస్పర ఆరోపణలతో కాలయాపన చేస్తున్నాయని, ఈ భూదోపిడీపై త్వరలోనే బీజేపీ ఆధ్వర్యంలో ‘దండయాత్ర’ చేపడతామని హెచ్చరించారు. ఆక్రమిత భూముల్లో కాషాయ జెండాలు పాతి పేదలకు పంచుతామని స్పష్టం చేసిన బండి సంజయ్, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే రెండు పార్టీల అవినీతి, భూఆక్రమణలపై కఠిన విచారణ జరిపిస్తామని చెప్పారు.

# మిగిలిన ఎమ్మెల్యేలకు ఇదే గతి

ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉపఎన్నిక వస్తే బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించేందుకు కృషి చేస్తామని ఆయన వ్యాఖ్యానించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన దానం నాగేందర్ ఓడిపోయారు. ఈ నేపథ్యంలో ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ ఫిరాయింపుపై దాఖలైన పిటిషన్లను పరిశీలించిన తర్వాత స్పీకర్ గడ్డం ప్రసాద్ దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించేందుకు నిరాకరించారు. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ కౌశిక్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు శుక్రవారం రోజున తీర్పు వెలువరించింది. చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌తో కూడిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం స్పీకర్ గడ్డం ప్రసాద్ నిర్ణయాన్ని పక్కనపెట్టి దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసింది. తాజా తీర్పులో దానం నాగేందర్‌ను ఆయన ఎంపీగా పోటీ చేసినప్పటి నుంచే అనర్హుడిగా హైకోర్టు పేర్కొంది. ఈ తీర్పు తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ ఫిరాయింపుల అంశంపై ఇప్పటికే కొనసాగుతున్న న్యాయపరమైన వివాదానికి ఈ తీర్పు మరో కీలక మలుపుగా మారింది. దానం నాగేందర్ అనర్హతపై వెలువడిన హైకోర్టు తీర్పుతో తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్ల విషయంలో తదుపరి న్యాయపరమైన పరిణామాలు ఎలా ఉంటాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ఏళ్ల నిరీక్షణకు తెర

ఎన్నికల కోసం కార్మిక సంఘాలు, ఉద్యోగులు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారు. తాజాగా షెడ్యూల్ విడుదల కావడంతో ఆర్టీసీలో ఎన్నికల సందడి మొదలైంది. కార్మిక శాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 21వ తేదీన ఎన్నికల్లో పోటీ చేసేందుకు యూనియన్ల సమ్మతి తీసుకోనున్నారు. సెప్టెంబర్ 22వ తేదీన యూనియన్లకు ఓటర్ల జాబితాను అందజేసి, అభ్యంతరాలను స్వీకరిస్తారు. సెప్టెంబర్ 24వ తేదీన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు దాఖలు చేయడానికి అవకాశం ఉంటుంది. సెప్టెంబర్ 25వ తేదీన తుది ఓటర్ల జాబితాను యూనియన్లకు అందజేస్తారు. సెప్టెంబర్ 26వ తేదీన పోటీ చేసే యూనియన్లకు ఎన్నికల గుర్తులు కేటాయించడంతో పాటు తుది ఓటర్ల జాబితాను రిటర్నింగ్ అధికారికి అందజేస్తారు. సెప్టెంబర్ 29వ తేదీన యూనియన్లకు డమ్మీ బ్యాలెట్ పేపర్లు అందించనున్నారు. అక్టోబర్ 9వ తేదీన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ ప్రక్రియను అక్టోబర్ 14, 15వ తేదీల్లో నిర్వహించనున్నారు. అనంతరం అక్టోబర్ 17వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తారు. ఈ ఎన్నికల్లో మెజారిటీ సాధించిన కార్మిక సంఘానికి ఆర్టీసీలో గుర్తింపు లభించనుంది. మొత్తం 11 కార్మిక సంఘాలకు ఎన్నికల షెడ్యూల్‌ను కార్మిక శాఖ పంపినట్లు సమాచారం.ఆర్టీసీలో అనేక కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ.. ఎన్నికల్లో మెజారిటీ సాధించి గుర్తింపు పొందిన సంఘానికే సంస్థ తరపున కార్మికుల సమస్యలపై అధికారికంగా చర్చించే హక్కు ఉంటుంది. కార్మికుల వేతనాలు, బోనస్‌లు, డీఏ, సర్వీస్ నిబంధనలు వంటి అంశాలపై ఆర్టీసీ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపడంలో ఈ గుర్తింపు సంఘం కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా కార్మికుల తరఫున ఒప్పందాలు, ఇతర ముఖ్యమైన అంశాలపై చర్చల్లోనూ గుర్తింపు సంఘం ప్రాతినిధ్యం వహిస్తుంది. రీజియన్, రాష్ట్ర స్థాయిల్లో గుర్తింపు సంఘాల కోసం వేర్వేరు బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించనున్నారు. రీజియన్‌లో ఆఫీసర్ స్థాయిలో ఉన్న ఉద్యోగులు మినహా మిగిలిన అర్హులైన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో వివిధ కార్మిక సంఘాలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ ఎన్నికల్లో ఏ సంఘానికి కార్మికుల మద్దతు లభిస్తుందనేది అక్టోబర్ 17వ తేదీన వెలువడే ఫలితాలతో తేలనుంది.

# యుద్ధం కొత్తేం కాదు, ఉపఎన్నికలకు రెడీ

రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నానని. అదే సమయంలో ఉపఎన్నికలు వస్తే ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పుపై స్పందించిన దానం నాగేందర్.. ప్రస్తుతం సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచన లేదని చెప్పారు. న్యాయస్థానం తీర్పును గౌరవిస్తున్నానని పేర్కొంటూనే.. రాజకీయాల్లో పోరాటాలు తనకు కొత్తేమీ కాదన్నారు. ఇంతకాలం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ఈ స్థాయికి వచ్చానని వ్యాఖ్యానించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే స్థానానికి ఉపఎన్నిక జరిగే పరిస్థితి వస్తే తాను పోటీకి సిద్ధంగా ఉన్నట్లు దానం నాగేందర్ ప్రకటించారు.

ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం, రాజకీయ పోరాటాలు చేయడం తనకు కొత్త కాదని పేర్కొన్నారు. ఉపఎన్నికను రాజకీయ పోరాటంగా అభివర్ణించిన దానం నాగేందర్.. మళ్లీ ప్రజల్లోకి వెళ్లి తన బలాన్ని నిరూపించుకుంటాననే ధీమా వ్యక్తం చేశారు. ఈ పోరులో విజయం సాధిస్తానని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. దీంతో హైకోర్టు తీర్పు తర్వాత ఖైరతాబాద్‌లో రాజకీయ సమీకరణాలపై ఆసక్తి మరింత పెరిగింది.

# సమీకృత కలెక్టరేట్ కార్యాలయ గణనాధుని శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహించాలి

**భక్తి భావం ఉప్పొంగేలా పూజా కార్యక్రమాలు నిర్వహణ**

**జిల్లా కలెక్టర్ ప్రతి మా సింగ్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) జిల్లా సమీకృతకలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా అధికారులు, ఉద్యోగులు భక్తిశ్రద్ధలతో ప్రతిష్టించి బొజ్జ గణపయ్యకు జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గణనాథుడికి పుష్పాలు సమర్పించి, ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా, భక్తి శ్రద్ధలతో సాగాలని ఆకాంక్షించారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయం .. గణనాథుడి నిమజ్జనం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ ప్రాంగణంలో అదనపు కలెక్టర్ నగేష్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అన్నదాన నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ విజయలక్ష్మి, ఎస్సీ వెల్ఫేర్ అధికారిని సింధు, డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, మహేందర్ గౌడ్, కలెక్టరేట్ కార్యాలయ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# బాలికను వెంటబడిన నిందితుడికి రెండేళ్ల జైలు

**- రూ.20 వేల జరిమానా. పటిష్ఠ సాక్ష్యాధారాలతో శిక్ష**

**- ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) బాలికను వెంటాడుతూ, బెదిరింపులకు పాల్పడిన పోక్సో కేసులో నిందితుడికి ప్రత్యేక పోక్సో కోర్టు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.మెదక్ పట్టణానికి చెందిన రాహుల్ 17 ఏళ్ల బాలికను వెంటాడుతూ, తనతో మాట్లాడకపోతే చనిపోతానంటూ బెదిరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. బాలికతో దిగిన ఫొటోను వాట్సాప్ స్టేటస్, డీపీగా పెట్టుకుని 'నా భార్య' అని రాసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. నిందితుడి వేధింపుల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన బాలిక తనకు హాని చేసుకునే ప్రయత్నానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొంది.ఈ ఘటనపై అప్పటి మెదక్ టౌన్ సీఐ మధు 2022 అక్టోబర్‌లో కేసు నమోదు చేసి సమగ్రంగా దర్యాప్తు నిర్వహించారు. కీలక సాక్ష్యాధారాలను సేకరించి, అనంతరం ఎస్ఐ మల్లారెడ్డి పూర్తి సాక్ష్యాధారాలతో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు.కేసు విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించారు. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.ఈ సందర్భంగా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మహిళలు, బాలికల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. బాలికలను వేధించడం, వెంటాడడం, బెదిరించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధితులు భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కేసులో లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ గౌడ్, సీడీఓ రమయ్య, లీగల్ అడ్వైజర్ శ్వేత సహకరించారని ఎస్పీ తెలిపారు. కేసు దర్యాప్తు, విచారణలో సమర్థవంతంగా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# ధరణి పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వంలో లక్షల కోట్ల విలువైన భూములను కాజేశారు

**డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, నియోజకవర్గ ఇన్చార్జ్ రాజిరెడ్డి**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) నర్సాపూర్ మండల కేంద్రంలో 22ఎ భూముల అంశంపై మీడియా సమావేశంలో నిర్వహించిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి రాజి రెడ్డి,టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరణి పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ నాయకులు లక్షల కోట్ల విలువైన భూములను కాజేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా రికార్డులతో సహా వివరించారని తెలిపారు.22–ఎ నిషేధిత భూముల జాబితా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది కాదని, గత ప్రభుత్వాల కాలంలో అమల్లోకి వచ్చిన భూ చట్టాల ప్రకారమే ఈ నిషేధిత జాబితా కొనసాగుతోందని వారు స్పష్టం చేశారు. 22–ఎ నిషేధిత జాబితాలో ఉన్న నిజమైన హక్కుదారుల భూముల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

ఈ విషయంలో హక్కుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అవసరమైన చోట సర్వే నంబర్లకు బై–నంబర్లు కేటాయించి, నిజమైన హక్కుదారుల భూములను గుర్తించి వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వెల్లడించారు. నిజమైన హక్కుదారులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం పనిచేస్తోందని, 22–ఎ భూముల విషయంలో ప్రజలు వాస్తవాలను తెలుసుకోవాలని అన్నారు.ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి రాజకీయంగా నాటకాలు, డ్రామాలు ఆడుతున్నారని, వాటిని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని వారు విమర్శించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నర్సాపూర్ నియోజకవర్గానికి ఏం చేసిందో చెప్పాలని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు ఉపయోగపడే విధంగా పాలన సాగలేదని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపాల్ చైర్మెన్ లక్ష్మి రాజు యాదవ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గుప్తా, నర్సాపూర్ బ్లాక్ అధ్యక్షులు రిజ్వాన్, మండల అధ్యక్షులు మల్లేశం, శ్రీనివాస్ రావు, మహేశ్వర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిలర్లు,అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొనారు..

**శ్రీ చౌదరి బాల్ గణేష్ మండలి ఆధ్వర్యంలో**

# మహా అన్న సంతర్పణ కార్యక్రమం



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) మెదక్ మండల పరిధిలోని పిట్లం బేస్ చౌదరి బాల్ గణేష్ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం నాడు అన్న సంతర్పణ కార్యక్రమం మండలి సభ్యుల సహకారంతో మరియు గణనాథుని ఆశీస్సులతో అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా చౌదరి బాల్ గణేష్ మండలి సభ్యులు మాట్లాడుతూ ఈ అన్నసంతర్పణ కార్యక్రమాన్ని మెదక్ పట్టణ ప్రజలు మరియు పిట్లం బేస్ భక్తులు చిన్న పెద్ద అని తేడా లేకుండా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న సంతర్పణ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన శ్రీ చౌదరి బాల్ గణేష్ మండలి సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో చౌదరి మహేష్, నవీన్ చౌదరి, చౌదరి శ్రవణ్, సురేష్, అరుణ్ అభిలాష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా




నాచారం (ప్రశ్న న్యూస్)భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నెల రోజుల పాటు నిర్వహిస్తున్న సేవా, సంబరాల కార్యక్రమాల్లో భాగంగా బీజేపీ మేడ్చల్ కౌన్సిల్ మెంబర్ సంగిశెట్టి రవీంద్రసాగర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి నివాళులర్పించి, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వందమంది మహిళలతో ఆరాధన కార్యక్రమం నిర్వహించి మోదీకి ఆశీర్వాదాలు అందించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వీరయ్య, నరేష్, శ్రీనివాస్, కురుమ అంజి, ముకేశ్ సాగర్, డి. యాదగిరి, మహిళా నాయకురాళ్లు లలిత, పుణ్యవతి, రజిని, రాజ్యలక్ష్మితో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

# గ్రామంలో విద్యుత్ సౌకర్యం కల్పించండి


**గ్రామ సర్పంచ్ సొప్పరి పుష్ప తనేష్**



గజ్వేల్ ( ప్రశ్నా న్యూస్ ) మండలం పరిధిలోని కొండాపూర్ గ్రామం గ్రామంలో ఎన్నో సంవత్సరాల నుంచి వీధి దీపాలు లేక గ్రామ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్న సందర్భంగా శుక్రవారం స్థానిక గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ సోప్పరి పుష్ప తానేష్ గజ్వేల్ లోని విద్యుత్ అధికారి డి ఈ ఏ డి ఈ వారి చాంబర్లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సోప్పరి పుష్ప తానేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు అధికారులకు విన్న మించిన పట్టించుకున్న పాపాన పోలేదని పేర్కొన్నారు.గ్రామంలో ఉన్నటువంటి వోల్టేజ్ కి సంబంధించిన 15 కెవి నుండి 25 డి టి ఆర్ అందించాలని కోరారు,గ్రామ ప్రజలు సరైన విద్యుత్ లేక ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు,గ్రామ ప్రజలకు ఇబ్బంది కాకుండా వెంటనే విద్యుత్తు సౌకర్యం కల్పించాలని కోరారు. "గజ్వేల్ డి ఈ వెంటనే స్పందించి కావలసిన విద్యుత్తు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం సర్పంచ్ సోప్పరి పుష్ప తనేష్ అధికారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు,గ్రామ సమస్యలె తమ సమస్యలుగా భావించి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామ అభివృద్దే తమ లక్ష్యంగా ముందుకు తీసుకువెళ్తానని వారు అన్నారు.గ్రామ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని చెప్పారు.

# మండల వైద్యాధికారిపై డీఎంహెచ్‌వోకు జర్నలిస్టుల ఫిర్యాదు

**ప్రభుత్వ కార్యక్రమాల సమాచారం ఇవ్వడం లేదని ఆరోపణ**



ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్) వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని జర్నలిస్టులకు ముందుగా అందించడం లేదని ఆరోపిస్తూ, మండలానికి చెందిన జర్నలిస్టులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి (డీఎంహెచ్‌వో) ఫిర్యాదు చేశారు.మండల వైద్యాధికారి సరియా అంజుమ్ ఆధ్వర్యంలో నిర్వహించే పలు వైద్య ఆరోగ్య కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలకు సంబంధించిన సమాచారం స్థానిక మీడియాకు అందడం లేదని జర్నలిస్టులు డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఉపయోగపడే వైద్య ఆరోగ్య కార్యక్రమాల వివరాలు ప్రజలకు చేరేందుకు మీడియాకు సమయానుకూలంగా సమాచారం అందించడం అవసరమని జర్నలిస్టు తెలిపారు. ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన కార్యక్రమాలు ప్రజలకు తెలియజేయడంలో స్థానిక మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, అందువల్ల మండల స్థాయిలో జరిగే కార్యక్రమాల సమాచారాన్ని జర్నలిస్టులకు అందించాలని డీఎంహెచ్‌వోను కోరారు.జర్నలిస్టుల ఫిర్యాదుపై స్పందించిన మండల వైద్యాధికారి సరియా అంజుమ్ ఇకపై మండలంలో నిర్వహించే ప్రతి కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని జర్నలిస్టులకు అందజేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.మండలంలో వైద్య ఆరోగ్య శాఖ చేపట్టే కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాల వివరాలను ఎప్పటికప్పుడు మీడియాకు అందిస్తే ప్రజలకు మరింత సమాచారం చేరే అవకాశం ఉంటుందని జర్నలిస్టులు తెలిపారు.

# మూడు మండలాల నుండి టిఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) నియోజకవర్గం లోని ఎల్లారెడ్డిపేట మండలంలో మహిళా సీనియర్ నాయకురాలు, బొమ్మన వేణి పరుశరాములు, కదిరే రేణుక, కదిరే భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో, వీర్నపల్లి మండలం నుండి సీనియర్ నాయకులు బండి శ్రీహరి, మండేపల్లి రవి ముదిరాజ్ ఆధ్వర్యంలో గంభీరావుపేట మండలం నుండి బందెల రాజు ఆధ్వర్యంలో, పలు గ్రామాల నుండి యువ నాయకుడు సయ్యద్ జావిద్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం దాదాపు 200 మంది స్వచ్ఛందంగా తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరడం జరిగింది. టిఆర్ఎస్ లో చేరడానికి వచ్చిన కార్యకర్తలను సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ మజీద్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈనెల 20న కొడంగల్ లో కవితక్క పాంచ జన్య సంకల్ప సభ నిర్వహించడం జరుగుతుందని, ఈ సభలో అందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజల సంక్షేమం కోసం టిఆర్ఎస్ పార్టీ చీఫ్ కవితక్క అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా మహిళలు, యువకులు కవితక్కకు బ్రహ్మరథం పట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మజీద్ మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవితక్క ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించడం జరుగుతుందని, ఉద్యమకారుల, సింగరేణి కార్మికుల, ఆటో కార్మికుల, నిరుద్యోగుల పక్షాన, నేరెళ్ల బాధితులకు న్యాయం, పోలీసు ఉద్యోగాల పెంపు ఇంకా ప్రజా సమస్యల పరిష్కారం చేయాలంటూ ఉద్యమాలు చేసి వాటి పరిష్కారానికి కృషి చేయడం జరిగిందన్నారు. కవితక్క ప్రతిపాదిస్తున్న పాంచజన్య పథకాలు, ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతు సంక్షేమం, ఉపాధి అవకాశాలు, సామాజిక న్యాయం వంటి ప్రజా సంక్షేమ విధానాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు రావడం జరుగుతుందన్నారు. మహిళలు, యువకులు, ప్రజలు పార్టీలో చేరడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. 2029లో తెలంగాణకు కల్వకుంట్ల కవితక్కను ముఖ్యమంత్రి చేయడమే మన అందరి లక్ష్యం అన్నారు. కవితక్క ఆశయాలు, పాంచజన్య సూత్రాలను ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి తీసుకెళ్ళి, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో రాజకీయాల్లోకి రావాలన్నారు. సామాజిక న్యాయం, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన పార్టీని బలోపేతం చేయాలని మజీద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు బైరి రాజేష్, మల్లవ్వ, లాస్య, లచ్చవ్వ, బొమ్మన వేణి పద్మ, పుష్పలత, ఎల్లవ్వ, మంజుల, పూజిత, అల్లే సత్తవ్వ, నర్సయ్య, అనసూయ, గంగారాణి, బుధవ్వ, నిమ్మల లావణ్య, మాధవి, అఖిల, తమ్మినవేని మల్లయ్య, ఈశ్వరవ్వ, శిరీష, దుర్గమ్మ, జ్యోతి, ముస్తాబాద్ మండల నాయకులు మార్వాడి దేవరాజు పాల్గొన్నారు.

# ప్రజలకు మరింత చేరువగా వైద్య సేవలు

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ఎల్లారెడ్డిపేట, కిషన్ దాస్ పేట(కిష్టంపల్లి)లో పల్లె దవాఖానాలు ప్రారంభించిన కలెక్టర్**



ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్)పల్లె దవాఖానాలతో ప్రజలకు మరింత చేరువగా వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలకేంద్రం, కిషన్ దాస్ పేట(కిష్టంపల్లి)లో పల్లె దవాఖానాల ప్రారంభ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఆయా పల్లె దవాఖానాలు ప్రారంభించారు. పల్లె దవాఖానాలో నిర్మించిన వివిధ గదులను అధికారులతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ పల్లె దవాఖానాల నిర్మాణంతో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వైద్యులు, సిబ్బంది ప్రతి రోజూ గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు వృద్ధులకు వైద్య సేవలు అందిస్తారని వివరించారు. పిల్లలు, గర్భిణులకు క్రమం తప్పకుండా టీకాలు, ఆరోగ్య పరీక్షలు, సలహాలు సూచనలు అందిస్తారని తెలియజేశారు. ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సబేరా బేగం, పీఏసీఎస్ చైర్మెన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, సర్పంచ్ నరసింహులు, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, ఇంచార్జి తహశీల్దార్ రజని, ఎంపీడీఓ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనానికి వేళాయే



బడంగ్ పేట (ప్రశ్న న్యూస్) వినాయక నవరాత్రుల్లో భాగంగా దేవతలగుట్టపై ప్రతిష్టించిన వినాయకునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నట్లు దేవతలగుట్ట ఆలయ ధర్మకర్త మందాడి. శివారెడ్డి తెలిపారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేస్తున్నామని తెలిపుచు శనివారం నాడు స్వామి వారికి ఉదయం పూజల అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సాయంత్రం గుట్ట కింద సహజసిద్ధంగా ఏర్పడిన నీటి గుండంలో వినాయకుని నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. ఈ విశిష్ట కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గోని స్వామివారి కృపకు పాత్రులవ్వాలని కోరారు.

# నేనే వచ్చా.. కేసు నమోదు చేయండి

- బాధితురాలి ఫిర్యాదుపై ఎమ్మెల్యే గల్లా మాధవి నేరుగా పోలీస్‌స్టేషన్‌కు
- కత్తితో బెదిరింపులపై మహిళ ఆవేదన
- మహిళల భద్రతపై రాజీ లేదన్న ఎమ్మెల్యే



**గుంటూరు(ప్రశ్న న్యూస్)** ప్రజా గ్రీవెన్స్‌లో ఓ మహిళ తన గోడును కన్నీటి పర్యంతమై వెళ్లబోసుకోగా.. ఆమెకు అండగా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి స్వయంగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. బాధితురాలి తరఫున తానే వచ్చానని, ఫిర్యాదుపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ప్రజాప్రతినిధి స్థాయిలో ఫోన్ చేసి అధికారులకు సూచనలు ఇవ్వడంతో ఆగకుండా.. బాధితురాలిని వెంటబెట్టుకుని స్టేషన్‌కు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రజా గ్రీవెన్స్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా రిజ్వానా అనే మహిళ తన ఇద్దరు ఆడపిల్లలతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించారు.

### అక్కా.. మమ్మల్ని కాపాడండి..

తన భర్త మద్యం సేవించి తరచూ వేధిస్తున్నాడని, కత్తితో బెదిరిస్తున్నాడని బాధితురాలు ఎమ్మెల్యేకు విన్నవించినట్లు తెలిపారు. ఇంట్లో ప్రశాంతంగా జీవించే పరిస్థితి లేదని, తనతో పాటు ఇద్దరు పిల్లలకు రక్షణ కల్పించాలని కోరారు. తన భర్తపై ఇప్పటికే పోక్సో చట్టం కింద కేసు నమోదై ఉన్నప్పటికీ వేధింపులు కొనసాగుతున్నాయని ఆమె ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. బాధితురాలి పరిస్థితిని విన్న ఎమ్మెల్యే.. ఈ నెల 17న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించినట్లు తెలిపారు. అయితే స్టేషన్‌కు వెళ్లినప్పుడు తమ వెంట ఎవరైనా వస్తేనే కేసు నమోదు చేస్తామని పోలీసులు చెప్పినట్లు బాధితురాలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదును విన్న ఎమ్మెల్యే గల్లా మాధవి అక్కడికక్కడే స్పందించారు. సాధారణంగా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించే అవకాశం ఉన్నప్పటికీ.. బాధితురాలి భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆమెను స్వయంగా తన వాహనంలో తీసుకుని సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. స్టేషన్‌లో పోలీసు అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే.. బాధితురాలి ఫిర్యాదును పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. "ఎవరో వస్తేనే కేసు నమోదు చేస్తామని చెప్పారట.. బాధితురాలి తరఫున నేనే వచ్చాను. ఫిర్యాదు తీసుకుని చర్యలు తీసుకోండి" అని ఎమ్మెల్యే పోలీసులను కోరినట్లు పేర్కొన్నారు. భద్రత కల్పించాలని విజ్ఞప్తిబాధితురాలికి, ఆమె పిల్లలకు రక్షణ కల్పించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పోలీసు అధికారులను కోరారు. గృహహింస, బెదిరింపులు, వేధింపులకు గురవుతున్న మహిళలు భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ప్రజా గ్రీవెన్స్ ద్వారా వచ్చిన సమస్యను అక్కడికక్కడే పరిష్కరించే దిశగా ఎమ్మెల్యే స్వయంగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడం.. బాధిత మహిళకు భరోసా కల్పించడంతోపాటు, ఫిర్యాదులపై స్పందన ఎలా ఉండాలన్న చర్చకు దారితీసింది.

# ఖైదీలకు భద్రత.. సంక్షేమమే లక్ష్యం

ప్రత్యేక మహిళా కారాగారంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పరిశీలన

ఆహారం, వైద్యం, తాగునీరు, పరిశుభ్రతపై ఆరా



రాజమహేంద్రవరం(ప్రశ్న న్యూస్) శిక్ష అనుభవిస్తున్న మహిళా ఖైదీలకు భద్రతతో పాటు మెరుగైన వసతులు, ఆరోగ్యం, మానసిక భరోసా కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలోని ప్రత్యేక మహిళా కారాగారాన్ని శుక్రవారం ఆమె డీఎస్పీ శివప్రియ, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవితో కలిసి సందర్శించారు. కారాగారంలో ఖైదీలకు అందుతున్న వసతి, భద్రత, పరిశుభ్రత, ఆహారం, వైద్య సేవలు, తాగునీరు, సంక్షేమ వసతులను పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### 130 మంది మహిళా ఖైదీలు.. ఇద్దరు పిల్లలు

ప్రస్తుతం ప్రత్యేక మహిళా కారాగారంలో సుమారు 130 మంది మహిళా ఖైదీలు, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఖైదీలకు అవసరమైన మౌలిక వసతులు అందించడంతో పాటు వారి సమస్యలను అధికారులు, కౌన్సెలర్లు, సిబ్బంది దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. ఖైదీలలో సానుకూల ఆలోచనా విధానం పెంపొందించేందుకు క్రమం తప్పకుండా కౌన్సెలింగ్, మార్గదర్శక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

### కిచెన్ నుంచి ఆసుపత్రి వరకు..

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ కారాగారంలోని జనరల్ కిచెన్, ఆసుపత్రి, బేకరీ, ఖైదీల బ్యారక్స్, పిల్లల క్రెచ్, ఆర్ఓ ప్లాంట్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఖైదీలకు రోజువారీగా అందిస్తున్న ఆహారాన్ని స్వయంగా రుచి చూసి నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించారు. ఆహారాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేసి అందిస్తున్న తీరును అభినందించారు. ఆర్ఓ ప్లాంట్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందుతున్న విధానాన్ని పరిశీలించారు. కారాగార ప్రాంగణంలో పచ్చదనం, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా నిర్వహిస్తున్న తీరును అధికారులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక మహిళా కారాగారం సూపరింటెండెంట్ సి. హెచ్. వసంతకుమారి, ఇందిరా భారతి రాయ్, పి. పావని, కె. సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

# అడ్డతీగలలో కలకలం కార్యకర్తలపై ఎమ్మెల్యే శిరీషాదేవి ఆగ్రహం

**అడ్డతీగల మండలం.** రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి వ్యాఖ్యలు అడ్డతీగల మండలంలో కలకలం రేపుతున్నాయి. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపైనే ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫిర్యాదులు చేస్తారా అంటూ మండిపడ్డారు. వైసీపీ వాళ్ళని పట్టించుకుంటున్నారని, తమను పట్టించుకోవడం లేదని కొందరు కార్యకర్తలు ఫిర్యాదు చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ క్రమంలో "ఒక్కొక్కరి తాట తీస్తా.. వదిలి పెట్టేది లేదు" అంటూ కార్యకర్తలకు గట్టిగా హెచ్చరిక జారీ చేశారు. ఈ వీడియో ఇప్పుడు వైరల్ గా మారింది. తమ కష్టంతో గెలిపించిన తమ పైనే తాట తీస్తాననడం ఎంతవరకు సమంజసమని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నేతలకు ప్రాధాన్యం ఇస్తూ తమను పక్కన పెడుతున్నారని, ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని అంటున్నారు. ఎమ్మెల్యే తీరుపై పార్టీ అధిష్టానం స్పందించాలని రంపచోడవరం నియోజకవర్గంలో ఉన్న టీడీపీ కార్యకర్తలు కోరుతున్నారు.

## ఆత్మకూరులో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యటన

**ఆత్మకూరు** ఆత్మకూరులో తన పర్యటనలో భాగంగా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆత్మకూరులోని వెస్ట్ ఎంపీపీఎస్ పాఠశాల ప్రాంగణంలో రూ.28.30 లక్షల వ్యయంతో నిర్మించిన భవిత భవనాన్ని చిన్నారులతో కలిసి ప్రారంభించారు. ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో రూ.53 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక వనరుల కేంద్రం (ఎంఆర్సీ), ఎంఈఓ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి ఆనం వెల్లడించారు. ఆత్మకూరు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో మంత్రి పాల్గొన్నారు.

# నవంబర్ 25న అంజిలి రెడ్డి వివాహం



**కడప**ఎక్స్ వేదికగా కుమార్తె వైఎస్ అంజిలి రెడ్డి వివాహానికి సంబంధించి బిగ్ అప్డేట్ ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ఇ,చ్చారు. ఈ నెల 24 న వైఎస్ అంజిలి రెడ్డి – సోమల రఘురామ్ రెడ్డి ల నిశ్చితార్థం . నవంబర్ 25 న వివాహం.. డిసెంబర్ 5 న రిసెప్షన్.. ఎక్స్ వేదికగా ప్రకటించారు. తొలి పెళ్లి కార్డును జూఖీ ఘాట్ వద్ద పెట్టి మహానేత ఆశీస్సులు తీసుకున్నామని తెలిపారు. నాన్న స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో.. – నా కుమార్తె వైఎస్ అంజిలి రెడ్డి – సోమల రఘురామ్ రెడ్డిల పరిశుద్ధ వివాహ మహోత్సవం జూఖీ కుటుంబంలో మరో సంతోషకరమైన క్షణం. ఇరువురి కలయిక దైవ సంకల్పం. నూరేళ్ల జీవితానికి శుభారంభం. ఈ నెల 24న నిశ్చితార్థం, నవంబర్ 25న పరిణయం, అలాగే డిసెంబర్ 5న రిసెప్షన్ వేడుక శుభవార్తను. దేవుడి ఆశీర్వాదంతో నాన్న ఘాట్ వేదికగా మీతో పంచుకోవడం అత్యంత ఆనందదాయకమని అన్నారు. కాబోయే నూతన వధూవరుల దాంపత్య జీవితం కన్నుల పండుగగా, – సుఖసంతోషాలతో సాగాలని, అంజిలి రెడ్డి, రఘురామ్ రెడ్డిల.. – తొలి వివాహ ఆహ్వాన పత్రికను నా కుటుంబ సభ్యులతో, మరియు రఘురామ్ తల్లిదండ్రులతో కలిసి.. ఇడుపులపాయలోని నాన్న వైఎస్సార్ ఘాట్ వద్ద ఉంచి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. నాన్న దీవెనలు బిడ్డల జీవితాలకు కొండంత అండ. – ఆయన చూపిన సన్మార్గం వారికి ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమని అన్నారు.

# పక్కకు ఒరిగిన నాలుగు అంతస్తుల భవనం

**హైదరాబాద్** హైదరాబాద్ గచ్చిబౌలి పరిధిలోని గోపన్పల్లిలో నాలుగు అంతస్తుల భవనం ప్రమాదకరంగా ఒక వైపునకు ఒరిగింది. కేవలం 30 చదరపు గజాల చిన్న విస్తీర్ణంలోనే ఎలాంటి పునాది భద్రత లేకుండా నాలుగంతస్తుల నిర్మాణాన్ని నిర్వాహకులు చెపట్టారు. భవనం ఎప్పుడు కూలిపోతుందోనన్న భయంతో అప్రమత్తమైన అధికారులు, చుట్టుపక్కల నివాసితులను ఖాళీ చేయించారు.

## ప్లాట్లు కొనుగోలు చేసి ఏళ్లు గడుస్తున్నా రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో బాధితుల ఆందోళన

**మేడ్చల్ జిల్లా** ప్లాట్లు కొనుగోలు చేసి ఏళ్లు గడుస్తున్నా రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో బాధితులు ఆందోళనకు దిగారు. మేడిపల్లి పిఎస్ పరిధి పీర్జాదిగూడ బాలాజీనగర్ లోని రియల్ ఎస్టేట్ సంస్థ యజమాని ఆశిష్ ఇంటివద్ద బాధితులు, ఏజెంట్లు టెంట్ వేసుకుని నిరసన చేపట్టారు. 2018లో యాదాద్రి భువనగిరి జిల్లా మాసాయిపేటలో సర్వహిత డెవలపర్స్ పేరుతో ఆశిష్, శ్రీకాంత్‌లు వెంచర్ నిర్వహించినట్లు బాధితులు, ఏజెంట్ లు తెలిపారు. ఏజెంట్ల ద్వారా సుమారు 100 మంది ప్లాట్లు కొనుగోలు చేశారని, నెలవారీగా చెల్లింపులు చేస్తూ ఒక్కొక్కరు సుమారు రూ.6 లక్షల నుంచి రూ.20లక్షల వరకు చెల్లించారని పేర్కొన్నారు. వారిలో కొంతమందికి రిజిస్ట్రేషన్లు చేసినప్పటికీ, మరికొందరికి ఇప్పటికీ రిజిస్ట్రేషన్లు చేయలేదని ఆరోపించారు. ఇదే సమయంలో వెంచర్ కోర్టు వివాదంలోకి వెళ్లడంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి నోటీసులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల వివాహాలు, ఇతర అవసరాల కోసం డబ్బులు చెల్లించి ఇబ్బందులు పడుతున్నామని బాధితులు తెలిపారు. గత కొన్నేళ్లుగా సమస్యను ఎదుర్కొంటున్న తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాధితులు, ఏజెంట్లు ఆశిష్ ఇంటివద్ద నిరసన చేపట్టారు. సమస్యను పరిష్కరించి తమ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాలని వారు కోరుతున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న మేడిపల్లి పోలీసులు, బాధితులతో పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

# హమారా ప్రసాద్ అరెస్ట్

**హైదరాబాద్**ంభారత రాజ్యాంగాన్ని వ్యతిరేకించే వారిపై దేశద్రోహం కేసులు నమోదు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. అంబేద్కర్ పై కల్పిత నాయకుడు అంటూ పుస్తకాన్ని రచించిన హమారా ప్రసాద్ ను అరెస్ట్ చేయడం దళితుల విజయమన్నారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మాల మహానాడు నాయకులు పాలాభిషేకం చేసి , పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ... హమారా ప్రసాద్ కేవలం డబ్బుకు కోసమే ఇలాంటి పుస్తకాన్ని రాశాడని ఆరోపించారు. ప్రజల.మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పంజాగుట్టలో ఐఫోన్ 18 ప్రో ఆవిష్కరణ

హైదరాబాద్ పంజాగుట్టలోని సమీర్ కమ్యూనికేషన్స్‌లో యాపిల్ నూతన ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ ఐఫోన్ 18 ప్రో, ప్రో మ్యాక్స్ మోడళ్లను ఘనంగా ఆవిష్కరించారు. అత్యాధునిక కెమెరా, ఏ20 ప్రో చిప్, మెరుగైన బ్యాటరీ సామర్థ్యం, ఏఐ ఆధారిత ఫీచర్లతో ఈ కొత్త మోడళ్లు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. నూతన ఐఫోన్ మోడళ్లను పరిశీలించేందుకు టెక్నాలజీ ప్రియులు, కస్టమర్లు ఆసక్తి చూపారు.

## వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డులకు కనీస వేతన 26 వేల రూపాయలు ఇవ్వాలి

– కుమ్మరికుంట్ల నాగన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు



సిఐ టి యు అనుబంధ సంఘం సెక్యూరిటీ గార్డుల సమావేశం వ్యవసాయ మార్కెట్లో మంగు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. దీనిని ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరికుంట్ల నాగన్న మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టో కాంగ్రెస్ ప్రభుత్వం సెక్యూరిటీ గార్డ్స్ కి ఇచ్చిన హామీలను పరిష్కరించకుండా ఎప్పటికీ 30 నెలలైనా పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారు ఇంత కాలం తక్కువ వేతనం ఇచ్చి వెట్టి చాకిరి చేయించుకోవడం జరుగుతుంది ఇప్పటికైనా తక్షణమే కనీస వేతనం 26000 ఇవ్వాలని పని భద్రత కల్పించాలని ప్రభుత్వ ఉద్యోగాలు గుర్తించాలని ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలని పని ప్రదేశాలలో ఏమైనా జరుగుతే మార్కెట్ వారే వ్యక్తిగత ఇన్సూరెన్స్ చేయించాలని కార్మికుడు మార్కెట్లో పనిచేస్తూ ప్రమాదాల చనిపోతే ప్రభుత్వమే 25 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని రిటర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని 60 ఏళ్లు దాటిన వారికి వారి కుటుంబంలో ఒకరిని పెట్టుకోవడానికి అవకాశం ఇవ్వాలని అన్నారు ఈ డిమాండ్లన్నీ తక్షణమే పరిష్కరించాలని లేనియెడల రేపు రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి జనార్ధన్ రాములు సారయ్య యాకన్న సరోజన నారాయణ లక్ష్మ నవీను రామ సంధ్య ఆంజనేయులు సురేష్ సోమియా సాయి వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు

# వినాయకుడిని దర్శించు కున్న టిడిపి సీనియర్ నాయకులు రితీష్ రెడ్డి



**బద్వేలు,** బద్వేలు పట్టణంలో వినాయక చవితి పురస్కరించుకొని శుక్రవారం ఉదయం బద్వేలు పట్టణంలోని నాలుగు రోడ్లకూడల్లోని ఆర్యవైశ్య సంఘం వారు ఏర్పాటుచేసిన వినాయకుని టిడిపి సీనియర్ నాయకులు రితీష్ రెడ్డి, లోయర్ సగిలెర్ ప్రాజెక్ట్ చైర్మన్ ఈగ వెంకట రమణారెడ్డి, దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆర్యవైశ్య వర్తక సంఘం, వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులు కెవి సుబ్బారావు, సగల సురేష్, సముద్రాల సురేష్, దొంతంశెట్టి జయకుమార్, ముచ్చర్ల సురేంద్ర, టిడిపి యువ నాయకుడు రీతిష్ రెడ్డిని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో రైల్వే కాంట్రాక్టర్ మేరెడ్డి శ్రీనివాసరెడ్డి,ఈగ సుబ్బారెడ్డి, మన్యం సుధాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కనుమరుల పూటీ ప్రసాద్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొలిశెట్టి నాగరాజా, కనుమరుల పూటీ లక్ష్మయ్య, జగదీశ్వర్ రెడ్డి, విద్యానగర్ సాంబశి వారెడ్డి, తెలుగు మండలి యువత నవ జ్యోతి రెడ్డి, బిజి వేముల రాజశేఖర్ రెడ్డి, వెంకటయ్య యాదవ్, పోకల సాంబశివారెడ్డి,పొన్న రాజేష్, బిజివేముల విజయ్ రెడ్డి, అంకన వెంకటసుబ్బారెడ్డి, బైసాని జయరామిరెడ్డి, బెస్తవేముల సునీల్, భూపాలం రాఘవేంద్ర,పెసల సుబ్రహ్మణ్యం, చెవుల కృష్ణమూర్తి, తో పాటు పలువురు టిడిపి నాయకులకు కార్యకర్తలు పాల్గొన్నారు

## విద్యుత్ శాఖ పై సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు

- సిబ్బంది పని తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే







**కందుకూరు** కందుకూరు నియోజకవర్గంలో విద్యుత్ శాఖ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలు, మరియు విద్యుత్ సరఫరా లో సమస్యలు సిబ్బంది పనితీరుపై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శు క్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో ఎస్ ఈ కట్ట వెంకటేశ్వర్లు, మరియు నియోజకవర్గంలోని అన్ని మండల ఏఈ లతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది నియోజకవర్గంలో లోని మండలాల్లో విద్యుత్ సమస్యలపై అదేవిధంగా గ్రామాల్లో జరుగుతున్న ఆర్డీఎస్ స్కిన్ ద్వారా అమలవుతున్న విద్యుత్ పనులపై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడడం జరిగింది ఈ సమావేశంలో ఎమ్మెల్యే సిబ్బంది పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు విద్యుత్ స్తంభాలు ఇతర పరికరాలు మార్చుటలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటున్నారని ప్రతిరోజు మీపై ఫిర్యాదులు వస్తున్నాయని చిన్న పని కూడా ప్రజలను పదేపదే కార్యాలయ కార్యాలయాలు చుట్టూ తిప్పుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే కు ప్రజలు ఫిర్యాదు చేయడంతో సిబ్బందిపై ఎమ్మెల్యే మండిపడ్డారు ఇప్పటికైనా మీ పద్ధతులు మార్చుకోవాలని వారిని హెచ్చరించడం జరిగింది

# భూముల రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్** భూముల రీసర్వే నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహిస్తూ రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం చిగురుమామిడి మండలం ఉల్లంపల్లిలో కొనసాగుతున్న భూముల సర్వేను కరీంనగర్ ఆర్డీవో షర్మిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్వే అధికారులతో మాట్లాడి పలు వివరాలు తెలుసుకున్నారు. రీ సర్వేతో భూముల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. సర్వే చేసే ముందు సంబంధిత రైతులకు తప్పనిసరిగా సమాచారం ఇచ్చి వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని ఆదేశించారు. సాంకేతిక పరికరాలతో సర్వే చేస్తున్నందున హద్దుల వివరాల నమోదులో పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో రెండు బృందాలు రీసర్వే చేస్తున్నాయని.. ఇప్పటివరకు 605 ఎకరాలు సర్వే చేసినట్లు తహసీల్దార్ వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కనుకయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# అడ్డగుట్టలో పోలీసుల మార్చ్‌ఫాస్ట్

- పండుగల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు
- ప్రజలకు భద్రతాభావం కల్పించడమే లక్ష్యం: ఏసీపీ శశాంక్‌రెడ్డి




సికింద్రాబాద్(ప్రశ్న న్యూస్) పండుగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శాంతిభద్రతలను పరిరక్షించేందుకు చిలకలగూడ డివిజన్ పోలీసులు అడ్డగుట్ట ప్రాంతంలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఏసీపీ శశాంక్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మార్చ్‌ఫాస్ట్‌లో పోలీసులు క్రమశిక్షణతో కవాతు చేస్తూ ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాల్లో భద్రతా పరిస్థితులను పరిశీలించారు.పండుగల సమయంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకునేలా పోలీసుల సన్నద్ధతను ఈ మార్చ్‌ఫాస్ట్ ద్వారా చాటిచెప్పారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులకు చట్టపరమైన చర్యలు తప్పవనే హెచ్చరికను ఇచ్చారు.అత్యవసర పరిస్థితులు, అల్లర్లు లేదా ఇతర అవాంఛనీయ ఘటనలు తలెత్తినప్పుడు పోలీసులు వేగంగా స్పందించేలా సిబ్బంది సమన్వయం, సన్నద్ధతను కూడా పరిశీలించారు. పండుగల సమయంలో ట్రాఫిక్, జనసమ్మర్థం అధికంగా ఉండే ప్రాంతాలను గుర్తించి అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు.ప్రజలు పోలీసులకు సహకరిస్తూ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని పోలీసులు సూచించారు. పోలీసుల మార్చ్‌ఫాస్ట్‌తో అడ్డగుట్ట ప్రాంత ప్రజల్లో భద్రతాభావం, ధైర్యం పెరిగిందని స్థానికులు పేర్కొన్నారు.

# బొజ్జ గణపయ్యకు ఘనమైన పూజలు



సుల్తాన్ బజార్ (ప్రశ్న న్యూస్) వినాయక నవరాత్రుల్లో భాగంగా కృపారాంబాగ్ లో వీనస్ అసోసియేషన్ ఆధ్యర్యంలో ప్రతిష్టించిన గణనాథునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నామని శాంత్ కుమార్ తెలిపారు. ప్రతి సంవత్సరం విభిన్న రూపాల్లో ఉన్న వినాయకుడిని ప్రతిష్టించి వినాయక చవితి నుండి సామూహికంగా నిమజ్జన కార్యక్రమం వరకు ఘనంగా పూజలను నిర్వహిస్తున్నామని తెలిపారు. వీనస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయకునికి 2001 సంవత్సరంలో రజితోత్సవ వేడుకలు, ప్రస్తుత 2026 లో స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రతి సాయంత్రం నిర్వహించే ప్రత్యేక పూజ కార్యక్రమాలు, ప్రసాద వితరణ, మహహారతి కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా మండప నిర్వాహణలో అగ్నివేష్, లడ్డు, అభి, సంజయ్ కులకర్ణి, గిరి, దాస్, అమోస్, ప్రతీక్, తదితరులు ప్రత్యేక చొరవతో ఆహ్లాదకర వాతావరణం గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు శాంత్ కుమార్ తెలిపారు

# సర్వభూపాల వాహనంపై గజేంద్ర మోక్ష అలంకారంలో శ్రీమలయప్ప

- అభయమిచ్చిన శ్రీవారు.. మాడ వీధుల్లో ఆధ్యాత్మిక సందడి



తిరుమల (ప్రశ్న న్యూస్)శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు సర్వభూపాల వాహనంపై గజేంద్ర మోక్ష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అంగరంగ వైభవంగా సాగిన వాహనసేవను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు మాడ వీధులకు తరలివచ్చారు. గజేంద్ర మోక్ష అలంకారంలో కొలువుదీరిన శ్రీవారిని కనులారా దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.వాహనసేవ సందర్భంగా మాడ వీధుల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన కళాబృందాలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు స్వామివారి దర్శనంతో పాటు కళా ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు.

## యశోప్రాప్తికి ప్రతీక

సర్వభూపాల వాహనం అందరు రాజులకు ప్రతీకగా భావిస్తారు. ఇందులో అష్టదిక్పాలకులైన ఇంద్రుడు, అగ్ని, యముడు, నిరృతి, వరుణుడు, వాయువు, కుబేరుడు, పరమేశ్వరుడు ఎనిమిది దిక్కుల్లో విరాజిల్లుతారు. అష్టదిక్పాలకులంతా శ్రీమహావిష్ణువును తమ భుజస్కంధాలపై, హృదయంలో కొలువుంచి సేవిస్తారనే భావనకు సర్వభూపాల వాహనం ప్రతీకగా నిలుస్తుంది.శ్రీమలయప్పస్వామివారి అనుగ్రహంతో రాజ్యపాలన సుభిక్షంగా సాగాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఈ వాహనసేవ సందేశమిస్తుంది.ప్రముఖుల పాల్గొనడం వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, సీవీఎస్వో కే.వి. మురళీకృష్ణ, పలువురు బోర్డు సభ్యులు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

# కల్పవృక్షంపై కొలువైన గోవుల గోపన్న

- తిరుమలలో వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- కల్పవృక్ష వాహన సేవలో పాల్గొన్న కోవూరు ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**తిరుమల(ప్రశ్న న్యూస్)** తిరుమల కొండపై శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల వైభవం అంబరాన్నంటుతోంది. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గోవుల గోపన్న అలంకారంలో కల్పవృక్ష వాహనంపై కొలువుదీరిన స్వామివారి దర్శనం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.సెప్టెంబరు 15 నుంచి 23వ తేదీ వరకు తిరుమలలో నిర్వహిస్తున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్పవృక్ష వాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు గోవింద నామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు.కల్పవృక్ష వాహనంపై మలయప్పస్వామికల్పవృక్షం కోరిన కోర్కెలు తీర్చే దివ్యవృక్షానికి ప్రతీకగా భావిస్తారు. అటువంటి కల్పవృక్ష వాహనంపై శ్రీమలయప్పస్వామివారు గోవుల గోపన్న అలంకారంలో దర్శనమివ్వడంతో తిరుమాడ వీధులు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. స్వామివారి వాహనసేవను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

## వాహనసేవలో ప్రశాంతి రెడ్డి

కోవూరు ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శుక్రవారం తిరుమల చేరుకుని బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు.సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న వాహనసేవలు భక్తులకు కనువిందు చేస్తున్నాయి. కల్పవృక్ష వాహనసేవలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.

# గరుడసేవకు గోదాదేవి మాలలు

- శ్రీవిల్లిపుత్తూరు నుంచి తిరుమలకు చేరిక..
- ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు



**తిరుమల(ప్రశ్న న్యూస్)** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన గరుడసేవకు శ్రీవిల్లిపుత్తూరు గోదాదేవి మాలలు తిరుమలకు చేరుకున్నాయి. తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు నుంచి తీసుకొచ్చిన ఆండాళ్, శిఖామణి మాలలకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ముందుగా మాలలను తిరుమలలోని శ్రీ బేడి ఆంజనేయస్వామివారి ఆలయం సమీపంలోని శ్రీ పెద్దజీయర్ మఠానికి తీసుకువచ్చారు. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ మాడవీధుల మీదుగా ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకెళ్లారు.

## రెండు కుటుంబాల నుంచి సంప్రదాయంగా..

ఆండాళ్ మాల, శిఖామణి మాలగా పిలిచే ఈ రెండు పుష్పమాలలను శ్రీవిల్లిపుత్తూరుకు చెందిన రెండు కుటుంబాల పూల తయారీదారులు తరతరాలుగా సంప్రదాయబద్ధంగా తయారు చేసి సమర్పిస్తున్నారు. తిరుపతికి సుమారు 650 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీవిల్లిపుత్తూరు నుంచి ఈ మాలలను తీసుకొచ్చారు.

గోదాదేవి మాలలకు ప్రత్యేక ప్రాశస్త్యంశ్రీవిల్లిపుత్తూరులో గోదాదేవికి అలంకరించిన పుష్పమాలను గరుడసేవ రోజున శ్రీవారికి అలంకరించడం అనాదిగా వస్తున్న సంప్రదాయంగా టీటీడీ తెలిపింది. పురాణ కథనాల ప్రకారం.. శ్రీరంగమన్నార్ స్వామివారికి పుష్పకైంకర్యం చేసిన పెరియాళ్వార్ కుమార్తె గోదాదేవి, స్వామిపై భక్తితో పుష్పమాలను ముందుగా తాను ధరించి అనంతరం సమర్పించేవారు. ఆమె భక్తికి మెచ్చిన శ్రీరంగనాథుడు ఆమె ధరించిన మాలలనే స్వీకరించారని భక్తుల విశ్వాసం.ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్, శ్రీవిల్లిపుత్తూరు ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల పరిరక్షణకు 'హరిత' బాట

- నెట్‌జీరో ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- సౌర, పవన విద్యుత్.. ఎలక్ట్రిక్ బస్సులకు ప్రాధాన్యం
- శేషాచల జీవవైవిధ్య పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ
- ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్



**మంగళగిరి(ప్రశ్న న్యూస్)** తిరుమల పవిత్రతను కాపాడటంతో పాటు శేషాచల కొండల పర్యావరణాన్ని పరిరక్షిస్తూ భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన సప్తగిరులను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.తిరుమల కేవలం ఆధ్యాత్మిక క్షేత్రం మాత్రమే కాదని, అరుదైన వృక్ష, జంతు, పక్షి జాతులకు నిలయమైన జీవవైవిధ్య ప్రాంతమని పేర్కొన్నారు. భక్తుల రాక పెరుగుతున్న నేపథ్యంలో వచ్చే తరాల వరకు తిరుమల సహజసిద్ధతను కాపాడేందుకు శాస్త్రీయ ప్రణాళికలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

## 100 శాతం పునరుత్పాదక విద్యుత్

తిరుమల చుట్టూ 10--12 కిలోమీటర్ల పరిధిలోని వ్యవస్థను సౌర, పవన విద్యుత్‌పై నడిపే దిశగా చర్యలు చేపడుతున్నట్లు విజయ్‌కుమార్ తెలిపారు. పగటిపూట ఉత్పత్తయ్యే సౌర విద్యుత్‌ను నిల్వ చేసేందుకు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.విద్యుత్ వాహనాలను ప్రోత్సహించడంతో పాటు తిరుపతి--తిరుమల ఘాట్ రోడ్లపై నడిచే ఆర్టీసీ బస్సులను దశలవారీగా ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చే ప్రతిపాదన ఉందన్నారు.

## శేషాచలానికి రక్షణ

శేషాచల బయోస్పియర్ రిజర్వ్‌లోని సహజ సంపదను కాపాడేందుకు ఎర్రచందనంతో పాటు స్థానిక వృక్షజాతుల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. వన్యప్రాణుల సహజ ఆవాసాలు, కారిడార్లను పరిరక్షిస్తూ అవి యాత్రికుల ప్రాంతాల్లోకి రాకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు.

చెత్త నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. తడి, పొడి వ్యర్థాలను మూలాల్లోనే వేరు చేయడం, ఆహార వ్యర్థాలను బయోగ్యాస్‌గా మార్చడం, మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగించడం వంటి చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

## నీటి వనరులపై దృష్టి

తిరుమలకు భవిష్యత్తులో నీటి కొరత రాకుండా సోమశిల పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్లు విజయ్‌కుమార్ తెలిపారు. సోమశిల జలాలను కండలేరు, బాలాజీ సాగర్ మీదుగా కల్యాణి డ్యామ్‌కు అనుసంధానం చేసే ప్రతిపాదనను వివరించారు.

## ఆధునిక మౌలిక వసతులు

శ్రీవేంకటేశ్వర మ్యూజియాన్ని టీసీఎస్ ట్రస్ట్ నిధులతో ఆధునికీకరించినట్లు తెలిపారు. తిరుపతిలో రైల్వే స్టేషన్ నుంచి కేంద్ర బస్‌స్టేషన్ వరకు స్కైవాక్, 50 ఎకరాల్లో మల్టీలెవల్ కార్ పార్కింగ్ వంటి ప్రతిపాదనలు ఉన్నాయని చెప్పారు.స్విమ్స్, బర్డ్, రుయా, పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రి తదితర వైద్య సంస్థలను అనుసంధానించి తిరుపతిని అంతర్జాతీయ స్థాయి వైద్య కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉందన్నారు. తిరుపతిని వివాహ వేడుకలకు అనువైన గమ్యస్థానంగా అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు.

## టీటీడీ ఆస్తుల పారదర్శకత

టీటీడీకి దేశవ్యాప్తంగా ఉన్న స్థిర, చర ఆస్తుల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం భావిస్తోందని విజయ్‌కుమార్ తెలిపారు. భక్తుల భద్రత కోసం ప్రమాదవశాత్తు మరణించే భక్తులకు బీమా పరిహారం అందించే విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు.తిరుమల భవిష్యత్ అభివృద్ధిని పర్యావరణ పరిరక్షణతో సమన్వయం చేయాల్సిన అవసరం ఉందని విజయ్‌కుమార్ అన్నారు. తిరుమల కాంక్రీట్ నిర్మాణాల విస్తరణకు గురికాకుండా హరిత మౌలిక వసతులతో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు.పర్యావరణ పరిరక్షణ, ఆధునిక సాంకేతికత, భక్తుల సౌకర్యాలను సమన్వయం చేసేలా ముఖ్యమంత్రి రూపొందించిన కార్యాచరణకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు సహకరించాలని ఆయన కోరారు.

# మహిళలకు అండగా 'వన్‌స్టాప్'

- బాధితులకు సత్వర న్యాయం
- సమగ్ర సేవలే లక్ష్యం
- సిబ్బందికి విధులు, బాధ్యతలపై ప్రత్యేక శిక్షణ
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ

**రాజమహేంద్రవరం(ప్రశ్న న్యూస్)** మహిళలకు అన్యాయం జరిగినప్పుడు వారికి అండగా నిలిచి, బాధితులకు సత్వర న్యాయం, అవసరమైన సహాయాన్ని అందించడంలో వన్‌స్టాప్ సెంటర్ల (ఓఎస్‌సీ) పాత్ర కీలకమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ అన్నారు. బాధిత మహిళలకు అందించే సేవల్లో నాణ్యత, వేగం పెంచే లక్ష్యంతో సిబ్బందికి ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రాజమహేంద్రవరం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలోని మాతృశిశు విభాగంలో శుక్రవారం వన్‌స్టాప్ సెంటర్ల సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ కార్యక్రమం వివరాలను వెల్లడించారు. జాతీయ మహిళా కమిషన్, రాష్ట్ర మహిళా కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని మహిళలకు వేగవంతమైన, మెరుగైన సేవలు అందించేలా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా 16 జిల్లాలకు చెందిన ఓఎస్‌సీ సిబ్బందికి రాజమహేంద్రవరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

## ఒకే చోట సమగ్ర సేవలు

హింస, వేధింపులు, ఇతర ఇబ్బందులకు గురైన మహిళలకు ఒకే చోట అవసరమైన సహాయం అందించడమే వన్‌స్టాప్ సెంటర్ల ప్రధాన ఉద్దేశమని శైలజ వివరించారు. లీగల్ కౌన్సెలింగ్, ఎఫ్‌ఐఆర్ నమోదులో సహకారం, పోలీసుల సమక్షంలో కేసుల డాక్యుమెంటేషన్, న్యాయపరమైన అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించినట్లు తెలిపారు.కేసుల నమోదు నుంచి తదుపరి చర్యల వరకు పాటించాల్సిన విధానాలు, బాధితులతో వ్యవహరించే తీరు, గోప్యతను కాపాడటం, వివరాలను సమగ్రంగా నమోదు చేయడం, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని సత్వర సహాయం అందించడం వంటి అంశాలపై నిపుణులు సూచనలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.



## సిబ్బందికి ఒత్తిడి తగ్గించేలా సెషన్లు

వివిధ రకాల కేసులతో నిరంతరం పనిచేసే ఓఎస్‌సీ సిబ్బంది మానసిక ఒత్తిడికి గురికాకుండా సైకియాట్రిస్టులతో ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ తెలిపారు. బాధితులకు సున్నితమైన రీతిలో సేవలందించడంతో పాటు, విధుల నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొనే అంశాలపై కూడా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

## సోషల్ మీడియా మోసాలపై అప్రమత్తత

సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న మోసాలు, వేధింపుల పట్ల యువతులు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని శైలజ సూచించారు. మహిళల భద్రత కోసం అందుబాటులో ఉన్న లిలి'శక్తి యాప్'లిలిను విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు. పిల్లల సోషల్ మీడియా వినియోగాన్ని తల్లిదండ్రులు బాధ్యతగా పర్యవేక్షించాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంపై అవగాహన, నియంత్రణ ఇంటి నుంచే ప్రారంభం కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఆనందరావు, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. స్వరూప, డీఎస్పీ వేణుగోపాల్, హైకోర్టు అడ్వకేట్ వసుమతి పూర్ణిమ, మానస హాస్పిటల్ సైకియాట్రిస్ట్ ప్రొఫెసర్ సురేష్, కాకినాడ మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ లక్ష్మి, జిల్లా మెంటల్ హెల్త్ టీమ్ కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్ డా. అఖిలేంద్ర శ్రీనివాస్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

# ‘తుడక్కమ్’ మూవీ రివ్యూ!




మోహన్ లాల్ కూతురు ‘విస్మయ’ ప్రధానమైన పాత్రను పోషించిన సినిమానే ‘తుడక్కమ్’. మార్షల్ ఆర్ట్స్ నేపథ్యంలో రూపొందిన యాక్షన్ డ్రామా ఇది. జుడే ఆంథోని జోసెఫ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో, నిర్మాత ఆంటోని పెరంబవూర్ తనయుడు ‘ఆశిష్ జో ఆంటోని’ ఒక కీలకమైన పాత్రను పోషించాడు. గెస్టు రోల్ లో మోహన్ లాల్ మెరిసిన ఈ సినిమా, ఆగస్టు 7వ తేదీన విడుదలై 40 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అలాంటి ఈ సినిమా ఈ రోజు ( సెప్టెంబర్ 18) నుంచి ‘జియో హాట్ స్టార్’ లో స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగు ఆడియోలోను అందుబాటులో ఉంది. ‘రవి బాలచంద్రన్’ ( మలయాళ సాయికుమార్) విలేజ్ ఆఫీసర్ గా పనిచేస్తూ ఉంటాడు. రెండు కాళ్లూ చచ్చుబడి పోవడం వలన, వీల్ చైర్ లో కూర్చునే తన కార్యకలాపాలు నిర్వహిస్తుంటాడు. ఆయనకి పెళ్లీడు కొచ్చిన ఒక కూతురు ఉంటుంది. ఆ అమ్మాయి పేరే ‘మీను’ ( విస్మయ మోహన్ లాల్). తల్లిలేని పిల్ల కావడంతో ఆయన చాలా గారాబంగా పెంచుతాడు. ఊరికి దూరంగా ఉన్న ఇల్లు కావడం వలన, ‘మెస్సి’ అనే ఒక కుక్కను పెంచుతూ ఉంటారు. అక్కడికి దగ్గరలో జోసెఫ్ మాస్టర్ ఇల్లు తప్ప, మరెవరూ కనిపించరు. ఆయనే రవి ఫ్యామిలీకి అండ అని చెప్పుకోవాలి. జోసెఫ్ మాస్టర్ కి ఒక తమ్ముడు ఉంటాడు. ఆస్తి విషయంలో అతను తరచూ అన్నతో గొడవపడుతూ ఉంటాడు. పెళ్లి చేసుకోకుండా ఒంటరిగా ఉంటున్న అతని కారణంగా తమకి ప్రమాదం ఉందని జోసెఫ్ భార్యకి ఒక అనుమానమైతే ఉంటుంది. ఆమె ఊహించినట్టుగానే ఆ ఫ్యామిలీని లేపేయాలని అతను నిర్ణయించుకుంటాడు. అందుకు సంబంధించిన ప్రయత్నాలు చేస్తుంటాడు. ‘మీను’కి ధైర్య సాహసాలు ఎక్కువే. ఎదుటివారికి సాయం చేయడంలో ఆమె ఎంతమాత్రం వెనుకాడదు. అలాంటి ఆమె బ్యాంకు టెస్ట్ రాయడానికి వెళ్లి తిరిగి రాకపోవడంతో తండ్రి కంగారుపడుతూ ఉంటాడు. ఆమె ఫోన్ కి కాల్ కూడా కనెక్ట్ కాకపోవడంతో అతను తీవ్రమైన ఆందోళనకి లోనవుతాడు. ఆమెతో పాటు వెళ్లిన స్నేహతురాలు ‘ప్రియ’ కూడా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం అతణ్ణి మరింత టెన్షన్ పెడుతూ ఉంటుంది. ఆ చీకట్లో పోలీసులకు ఫిర్యాదు చేయడానికి స్టేషన్ కి వెళ్లిన రవిని, అక్కడి పోలీసులు పెద్దగా పట్టించుకోరు. ప్రియతో కాకుండా బస్సులో ఒంటరిగా వస్తున్న ‘మీను’, క్రిమినల్ తో గొడవపడుతుంది. చాలా తేలికగా హత్యలు చేసే అతను, తన వలలో పడవలసిన అమ్మాయిలను మీను తప్పించిందనే కోపంతో ఉంటాడు. కరడుగట్టిన ఆ నేరస్థుడి బారి నుంచి ‘మీను’ బయట పడుతుందా? ప్రియ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడానికి కారణం ఏమిటి? అనేది మిగతా కథ.పొద్దుపోయినా కూతురు ఇంటికి తిరిగి రాకపోతే ఏ తండ్రికైనా చాలా టెన్షన్ గా ఉంటుంది. ఇక ఆ తండ్రి నిస్సహాయుడైతే, ఆందోళన మరింత ఎక్కువగా ఉంటుంది. ఆ కూతురు ఒక భయంకరమైన కిరాతకుడి కంట్లో పడితే .. అతనితో ఆమె గొడవపడితే ఏం జరుగుతుంది? ఒక ఆడపిల్లకి .. ఒక హంతకుడికి మధ్య జరిగే పోరాటం చుట్టూ నడిచే కథను దర్శకుడు చాలా పట్టుగా రాసుకున్నాడు. నిస్సహాయుడైన ఒక తండ్రి .. అతను ప్రాణంగా చూసుకునే ఒక కూతురు, ఆస్తి తాలూకు గొడవలతో ఇద్దరు అన్నదమ్ములు ..ఆ మధ్య ఒక నరహంతకుడు. ఈ ఐదు పాత్రలతో దర్శకుడు ఈ కథను నడిపించుకుంటూ వెళ్లాడు. తండ్రీ కూతుళ్లు .. హంతకుడు .. ఈ మూడు పాత్రలు మరింత ప్రాధాన్యతను సంతరించుకుని కనిపిస్తాయి. ఈ సినిమా ఫస్టాఫ్ .. సెకండాఫ్ అన్నట్టుగా మనకి గుర్తుండదు. మొదలుపెట్టిన దగ్గర నుంచి పూర్తయ్యేవరకూ దృష్టిని మరో వైపు వెళ్లనీయదు. ‘మీను’ పాత్రకి కిల్లర్ తారసపడటం .. ఇద్దరి మధ్య గొడవ .. ఆమెను అతను ఫాలో కావడం .. వంటి సన్నివేశాలు సహజత్వానికి చాలా దగ్గరగా వెళుతూ ఉత్కంఠను రేకెత్తిస్తాయి. కిల్లర్ ఎప్పటికప్పుడు ‘మీను’కి చాలా దగ్గరగా వస్తుంటాడు. ఆ సమయంలో ఆడియన్స్ గుండెదడ పెరగడం ఖాయమని చెప్పాలి. ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ దగ్గరికి వచ్చేసరికి, ఏం జరుగుతుందో ఏమిటో అనే ఒక టెన్షన్ ఆడియన్స్ లో మొదలవుతుంది. ఇటు మీను పాత్ర .. అటు కిల్లర్ పాత్ర ఈ రెండు కూడా ఈ కంటెంట్ కి రెండు కళ్ల మాదిరిగా కనిపిస్తాయి. అయితే కిల్లర్ పాత్రను డిజైన్ చేసిన తీరు ఎక్కువ మార్కులు కొట్టేస్తుంది. మొదటి నుంచి చివరి వరకూ కిల్లర్ పాత్రకి ఎక్కడా డైలాగ్స్ ఉండవు. సినిమా ఇంకో 10 నిమిషాల్లో పూర్తవుతుందనగా, ఓ రెండు మాటలు ఉంటాయంతే. అప్పటివరకూ ఆ పాత్ర చూపులతో .. బాడీ లాంగ్వేజ్ తోనే భయపెడుతుంది. జోమన్ జాన్ ఫొటోగ్రఫీ .. జేక్స్ బిజోయ్ నేపథ్య సంగీతం .. చమన్ చాకో ఎడిటింగ్ ఈ కథకు అదనపు బలాన్ని అందించాయని చెప్పచ్చు. ఆసక్తికరమైన సన్నివేశాలే తప్ప, అనవసరమైన సన్నివేశాలు ఎక్కడా కనిపించవు. విస్మయ మోహన్ లాల్ కి ఇది ఫస్టు మూవీ అయినప్పటికీ గొప్పగా చేసింది. ఆశిష్ కూడా తన పాత్రలో మెప్పించాడు. మిగతా నటీనటులంతా తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. ఈ రోజులలో ఆడపిల్లలను బయటికి పంపించడమంటే, ప్రమాదంలోకి పంపించడం వంటిదేనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అలాగని వాళ్లను ఇంటికి పరిమితం చేయలేరు .. ఎప్పుడూ ఎవరో ఒకరు తోడుగా రానూ లేరు. అందుకే ఆత్మరక్షణ కోసం వాళ్లకి మార్షల్ ఆర్ట్స్ నేర్పించవలసిన అవసరం ఉందనే సందేశాన్ని ఇచ్చిన సినిమా ఇది. ఈ మధ్య కాలంలో వచ్చిన బెస్ట్ కంటెంట్ గా ఈ సినిమాను గురించి చెప్పుకోవచ్చు.



## మాయలేడి ఆగ్రహం

రాకేష్ వర్రే హీరోగా నటిస్తూ, నిర్మిస్తున్న తాజా సినిమా ‘మాయలేడి’. మధుమిత సర్కార్ కథానాయిక. ప్రశంకర్ దర్శకుడు. అక్టోబర్‌లో విడుదల కానున్నది. ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ప్రేమ, పెళ్లి విషయాల్లో కచ్చితమైన అభిప్రాయం ఉన్న క్రిష్ అనే యువకుడికి, ఆశా అనే ఫైర్ బ్రాండ్ లాంటి అమ్మాయి మధ్య కథ ఇది.యాక్షన్ సినిమాలు స్ట్రీమ్ చేయండి సహజంగా కోపిష్టి అయిన ఆశకు క్రిష్‌కి గతంలో రూపా అనే గర్ల్‌ఫ్రెండ్ ఉండేదని తెలుస్తుంది. కోపంతో ఊగిపోతుంది. రూపా గురించి తెలుసుకున్న ఆశా ఏం చేసింది? అనేది ఈ సినిమా కథ.

## మరో 29 రోజుల్లో..



పీరియాడిక్ డ్రామా ‘రణబాలి’ చిత్రీకరణ పూర్తి చేసుకున్నట్లు గురువారం మేకర్స్ వెల్లడించారు. 19వ శతాబ్దం నాటి ఈ కథలో విజయ్ దేవరకొండ రణబాలి పాత్రలో కనిపించనుండగా, రష్మిక మందన్న జయమ్మ పాత్రను పోషించారు. వివాహానంతరం ఈ దంపతులు కలిసి నటించిన చిత్రమిదే కావడంతో ఈ ప్రాజెక్ట్ అందరిలో ఆసక్తిని పెంచుతున్నది. దాదాపు 130 రోజుల పాటు షూటింగ్ జరిగిందని, టీమ్ అంతా నిర్విరామంగా కష్టపడ్డామని చిత్ర దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. మరో 29 రోజుల్లో సినిమా ప్రేక్షకుల ముందుకురానుందని పేర్కొన్నారు. ఈ మేరకు కౌంట్‌డౌన్ పోస్టర్‌ను పంచుకున్నారు. ఇటీవల విడుదల చేసిన టీజర్‌లో శింగనమల బొబ్బిలి రణబాలి పాత్రలో విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ స్క్రీన్‌ప్రజెన్స్‌తో ఆకట్టుకున్నారు. 1854-1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రానికి సంగీతం: అజయ్-అతుల్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచన-దర్శకత్వం: రాహుల్ సంకృత్యాన్.



## “మగవాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుండు

### - శ్రుతి హాసన్ ఇలా అనేసిందేంటి?

“మగవాళ్లకు కూడా నెలసరి (పీరియడ్స్) వస్తే ఎంత బాగుండు! కనీసం అప్పుడైనా మా కాంట్రాక్టులలో అధికారికంగా ‘పీరియడ్స్ సెలవులు’ అని రాసేవారేమో” అంటూ ప్రముఖ నటి శ్రుతి హాసన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశమయ్యాయి. మహిళలు ముఖ్యంగా సినీ రంగంలో పనిచేసే వారు పీరియడ్స్ సమయంలో ఎదుర్కొనే శారీరక, మానసిక ఇబ్బందుల గురించి ఆమె బహిరంగంగా మాట్లాడారు. నటి సోహా అలీ ఖాన్ నిర్వహిస్తున్న ఓ పాడ్‌కాస్ట్‌లో శ్రుతి ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.తాను పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీఓఎస్) అనే ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నానని, దీనివల్ల పీరియడ్స్ సమయంలో తీవ్రమైన నొప్పిని ఎదుర్కొంటానని ఆమె వెల్లడించారు. కెరీర్ తొలినాళ్లలో షూటింగ్ సెట్‌లో ఈ నొప్పి గురించి ఎవరితోనూ చెప్పుకోలేకపోయానని గుర్తుచేసుకున్నారు. ఒకవైపు ఈ అంశంపై మాట్లాడటం నిషిద్ధం అని భావించడం, మరోవైపు ఇబ్బందిగా ఉండటంతో మౌనంగా భరించేదాన్నని తెలిపారు. “కొన్ని రోజులు నేను చాలా నీరసంగా కనిపించేదాన్ని. నా ఎనర్జీ లెవెల్స్ పడిపోయేవి. కానీ, దర్శకులు గానీ, ఇతరులు గానీ నాలో ఆ మార్పును గమనించినా అసలు కారణం వారికి తెలిసేది కాదు” అని శ్రుతి వివరించారు.అయితే, ఓ సంఘటన తన ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేసిందని శ్రుతి తెలిపారు. తన సహనటుడికి మోకాలికి సర్జరీ అయినప్పుడు, షూటింగ్ సిబ్బంది మొత్తం అతనికి అనుకూలంగా ఏర్పాట్లు చేసి, చాలా జాగ్రత్తగా చూసుకున్నారని చెప్పారు. అది చూశాక, తన ఆరోగ్య సమస్య గురించి కూడా ధైర్యంగా మాట్లాడాలని నిర్ణయించుకున్నానని అన్నారు.ఆ తర్వాత మొదటిసారి ఓ దర్శకుడికి తన ఆరోగ్య పరిస్థితిని వివరించానని, ఆయనకు కూడా కూతురు ఉండటంతో తన బాధను వెంటనే అర్థం చేసుకున్నారని శ్రుతి గుర్తుచేసుకున్నారు. “ఆయన సానుకూల స్పందనతో మా మధ్య సంభాషణ తీరే మారిపోయింది. సెట్‌లో వాతావరణం మరింత స్నేహపూర్వకంగా మారింది. ఆ తర్వాత నుంచి నా ఇబ్బందిని ధైర్యంగా చెప్పగలుగుతున్నాను” అని ఆమె పేర్కొన్నారు.శ్రుతి వ్యాఖ్యలకు సోహా అలీ ఖాన్ కూడా మద్దతు తెలిపారు. ఒకవేళ మగవాళ్లకు పీరియడ్స్ వస్తే, ఎవరు ఎక్కువ బ్లీడ్ అయ్యారు, ఎవరి ట్యాంపూన్ సైజు పెద్దది అనే విషయాల్లో వారు పోటీ పడేవారేమోనని సరదాగా వ్యాఖ్యానించారు. ఇక శ్రుతి సినిమాల విషయానికొస్తే, గతేడాది రజినీకాంత్‌తో కలిసి నటించిన ‘కూలీ’ చిత్రం ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.518 కోట్లు వసూలు చేసినా మిశ్రమ స్పందనలు అందుకుంది. ఇటీవల ‘పెద్ది’ చిత్రంలో ఓ పాటలో ఆమె కనిపించారు. ప్రస్తుతం ఆమె విజయ్ సేతుపతితో కలిసి తమిళంలో ‘ట్రైన్’, దుల్కర్ సల్మాన్‌తో తెలుగులో ‘ఆకాశంలో ఒక తార’ చిత్రాల్లో నటిస్తున్నారు.

## ఆరు నెలల్లో వెయ్యికోట్లు

‘పుష్ప’ ఫ్రాంచైజీ, యానిమల్, ఛావా, సికిందర్, ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాలతో ఒకే ఏడాది వేలకోట్ల వసూళ్లు రాబట్టి సినీ సామ్రాజ్యానికి క్వీన్‌గా అవతరించింది రష్మిక మందన్న. ఇక ఏ హీరోయిన్‌కైనా ఈ స్థాయి ట్రాక్ రికార్డు కష్టమే అని అంతా అనుకుంటున్న తరుణంలో ఉన్నట్టుండి మలయాళ భామ మమితాబైజు ఊడిపడింది. ఆర్నెల్ల క్రితం ధనుష్‌తో ఆమె నటించిన ‘కర’ సినిమా పెద్దగా ఆడలేదు. కానీ 50కోట్ల వసూళ్లు రాబట్టింది. ఇక అక్కడ్నుంచి మొదలైంది మమితాబైజు విజయవిహారం.క్యాలెండర్‌లు ఎంచుకోండి ప్రదీప్ రంగనాథ్‌తో ఆమె నటించిన ‘డ్యూడ్’ సినిమా వందకోట్ల వసూళ్లు రాబట్టింది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో కలిసి నటించిన ‘జననాయగన్’ 300కోట్లు, రీసెంట్‌గా విడుదలైన మలయాళ చిత్రం ‘బెత్లహోమ్ కుటుంబ యూనిట్’ చిత్రం 300కోట్లు, సూర్య తాజా బ్లాక్‌బస్టర్ ‘విశ్వనాథ్ అండ్ సన్స్’తో 260కోట్లు.. ఇలా కేవలం ఆరు నెలల వ్యవధిలోనే తన సినిమాల వసూళ్లతో వెయ్యికోట్ల మార్క్‌ని దాటేసింది మమితా బైజు. ఆమె నటించిన మూడు సినిమాలు వరుసగా 200కోట్ల వసూళ్లు



## సినిమా రిలీజ్ తర్వాత జడల్ అని పిలుస్తారు

‘ప్రేక్షకులకు గొప్ప మాస్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ‘ది ప్యారడైజ్’. ఈ సినిమా ఎంత అద్భుతంగా ఉంటుందో ఈ నెల 24న చూస్తారు. చాలా స్ట్రాంగ్ ఎమోషన్స్‌తో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ సినిమా తీశారు. నా గత చిత్రాలకు తమిళ ప్రేక్షకులు మంచి సపోర్ట్ ఇచ్చారు. నా కెరీర్‌లో ఇంత కష్టపడ్డ సినిమా లేదు. కచ్చితంగా ఈ సినిమా కూడా మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. ఇప్పుడు మీరంతా నన్ను ‘నాని’ అని పిలుస్తున్నారు. రేపు ఈ సినిమా విడుదలయ్యాక అంతా ‘జడల్’ అని పిలుస్తారు. సుబ్బుగా చేసిన కయాదు లోహర్, కీర్తి సురేశ్ క్యామియో.. అనిరుధ్ సంగీతం ఈ సినిమాను నెక్స్ట్ లెవల్లో నిలబెట్టాయి’ అని అగ్ర కథానాయకుడు నాని అన్నారు. ఆయన హీరోగా రూపొందిన పీరియడ్ యాక్షన్ చిత్రం ‘ది ప్యారడైజ్’. కయాదు లోహర్ కథానాయిక. మోహన్‌బాబు ప్రత్యేక పాత్ర పోషించారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో చెరుకూరి సుధాకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న ప్రపంచవ్యాప్తంగా పానిండియా స్థాయిలో విడుదల కానున్నది. ఈ సందర్భంగా గురువారం చెన్నైలో నిర్వహించిన ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నాని మాట్లాడారు. ప్యారడైజ్ ఓ రెవల్యూషనరీ ఫిల్మ్ అని, నాని ఇందులో రెబల్‌గా కనిపిస్తారని, తన ప్రాంతం కోసం, ఉనికి కోసం, ప్రజల కోసం , తల్లి కోసం తను ఎలా పోరాడాడు అనేది ఇందులో ప్రధానాంశమని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల అన్నారు. ఈ సినిమాను తమిళంలో విడుదల చేస్తున్న స్వరూప్ కూడా మాట్లాడారు.



# సొమ్మొకడిది సోకొక్కడిదా.?

## ఘాటు వ్యాఖ్యలు చేసిన భాజపా నాయకులు



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) సొమ్మొకడిది సోకొక్కడిదా అని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు భాజపా నాయకులు. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అందరూ హాజరయ్యారు. కానీ మా భాజపా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సమాచారం ఎందుకు ఇవ్వలేదు. ఆహ్వానించకపోవడాని తీవ్రంగా ఖండించారు భాజపా నాయకులు. ఎల్లారెడ్డిపేట, కిషన్ దాస్ పేట (కృష్ణంపల్లి)లో పల్లె దావాఖానాలు కలెక్టర్ గరీమ అగ్రవాల్ ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసిన తర్వాత అక్కడున్న అధికారులను భారతీయ జనతా పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మాలోత్ కిరణ్ నాయక్, జిల్లా కౌన్సిల్ మెంబర్ చందుపట్ల లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నిధుల నుండి మంజూరై ప్రారంభోత్సవం జరుపుకుంటున్న ఆయుష్మాన్ భారత్ పల్లె దావాఖానా , ప్రారంభోత్సవానికి భారతీయ జనతా పార్టీ నాయకులకు ఆహ్వానం లేదు అని ఆరోపించారు. అధికారులను ప్రశ్నించగా జవాబు లేక ఒక అధికారి పేరు ఒకరు చెప్పుకుంటూ దాటవేసే ధోరణితో వ్యవహరించారు. సొమ్మొకడిది సోకొక్కరిది అనే రకంగా వ్యవహరిస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. వివిధ పార్టీల నాయకులతో కలిసి కలెక్టర్ అధికారికంగా ప్రారంభించారు. దీన్ని భారతీయ జనతా పార్టీ మండల శాఖ తరపున తప్పుపడుతూ ప్రజల సంక్షేమం కొరకు భారతీయ జనతా పార్టీ నాయకులు అహర్నిశలు ప్రజల సమస్యలను తీర్చడానికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతో ప్రజాప్రయోజనాలను సమకూర్చే విధంగా భాజపా నాయకులు కృషి చేస్తా ఉంటే, అధికార పార్టీ చెప్పు చేతల్లో అధికారులు ఉంటున్నారని ఆరోపించారు. భారతీయ జనతా పార్టీ నాయకులను ఆహ్వానించకుండా అవమాన పరుస్తున్నారని ఆరోపించారు. అన్ని పార్టీల నాయకులను సమదృష్టితో చూడాల్సినటువంటి అధికారులు, అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారన్నారు. భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తూ ఇటువంటి పరిస్థితులు మళ్లీ ఎదురైతే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

# ధర్మారెడ్డిపల్లి రైల్వే బ్రిడ్జి కింద రోడ్డు మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలి

## బీజేపీ జిల్లా కార్యదర్శి ఎలికంటి సురేష్, మండల అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్ నుంచి చేగుంట వెళ్లే ప్రధాన రహదారిలో ధర్మారెడ్డిపల్లి గ్రామ సమీపంలోని రైల్వే బ్రిడ్జి కింద రోడ్డు పూర్తిగా దెబ్బతిని, ఇనుప రాడ్లు బయటకు తేలడంతో ప్రమాదకరంగా మారిందని భారతీయ జనతా పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు.చేగుంట సమీపంలో స్క్రాప్ దుకాణాలు ఉండటంతో భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉంటున్నాయని, దీంతో రోడ్డుపై ఉన్న గుంత రోజురోజుకూ మరింత పెద్దదవుతోందని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు వంజరి రాజు, మండల ప్రధాన కార్యదర్శులు ఇప్ప స్వామి, బారు అరవింద్, మండల ఉపాధ్యక్షులు శివమల్లు, శ్రీకాంత్ గౌడ్, బీజేవైఎం నాయకుడు మహేష్ చారి, మండల నాయకులు రామస్వామి, మురారి, లక్ష్మణ్, శ్రీరామ్, నగేష్, శ్రీరామరాజు, సోషల్ మీడియా నాయకుడు మణికంఠ ముదిరాజ్, నాయకులు మల్లేశం, వెంకటేష్ రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# బాపు నా డ్యూటీ మీరు చేస్తారా.?

## ఆవేశపడ్డ హరిదాస్ నగర్ గ్రామస్తులు

## దివ్యంగా సమాధానం చెప్పిన తహశీల్దార్ దివ్య జ్యోతి



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) ఆవేశంగా తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన హరిదాస్ నగర్ గ్రామస్తులు. కొందరికి మాత్రమే పర్మిషన్లు ఇస్తూ, మిగతా వారికి ఎందుకు ఇసుక కూపన్లు ఇవ్వడం లేదంటూ తహశీల్దార్ ను ప్రశ్నించారు. కార్యాలయంలో పని చేస్తున్న ప్రవేట్ వ్యక్తి కొందరికి మాత్రమే అనుగుణంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. వారు చెప్పేది అంతా విన్న తర్వాత తహశీల్దార్ దివ్య జ్యోతి మాట్లాడుతూ వినాయకుడి ముందు పూజలో కూర్చొని ఉంటే, రాత్రి 9-30 గంటలకు ఫోన్లు చేసి విసిగించడం ఎంతవరకు సమంజసం అని ఆవేశంలో ఉన్న హరిదాస్ నగర్ గ్రామస్తులను తహశీల్దార్ దివ్య జ్యోతి ప్రశ్నించింది. ఇసుక రీచ్ లో లేనిపోని లొల్లులు పెట్టుకొని ఇబ్బందుల పాలు కావద్దు. అనవసరమైన ఆరోపణలు చేస్తూ లేని పోనీ గొడవలు చేస్తే సహించేది లేదు అంటూ హెచ్చరించింది. అన్నదమ్ముల కలిసి పనిచేసుకుంటామంటే మంచిది కానీ, లేనిపోని లొల్లులు తయారు చేస్తే బండ్లు అన్ని పోలీస్ స్టేషన్ లో ఉంటాయని హెచ్చరించింది. ఇంటి యజమానుల దగ్గర డబ్బులు తీసుకొని ఉంటారు. అప్పులు చేసి ట్రాక్టర్లు కొని నడిపిస్తూ ఉంటారు. అనవసరంగా లేనిపోని గొడవలు పెట్టుకుని ఇబ్బందుల పాలు కావద్దు. మీ యొక్క బాధను అర్థం చేసుకొని, స్టేషన్ కు లెటర్ రాసి పెట్టడం జరిగిందని, లేకపోతే అన్ని బండ్లు స్టేషన్లోనే ఉండేవని అనడంతో, పెద్ద మనుషులు కలగజేసుకుని మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటామని అన్నారు. బాపు మీ వల్ల రెండు గంటల సమయం వృధా అయ్యింది. నేను చేయవలసిన పని ఆగిపోయింది ఆ పని ఇప్పుడు మీరు చేస్తారా అని అనడంతో అందరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఇప్పటికైనా అన్నదమ్ముల కలిసి మంచిగా పనులు చేసుకోండి. లేదు ఇలాగే లొల్లులు పెట్టుకుంటాం అంటే మాత్రం మీరే నష్టపోతారు. నాది ఏముంది నా పని నేను చేసుకుని కారులో హాయిగా వెళ్ళిపోతాను. మీరే నష్టపోతారు అని అనడంతో ఆవేశంలో ఉన్న వారందరూ ఆలోచనలో పడ్డారు. అధికారిలా ఆలోచించకుండా మన బాధను అర్థం చేసుకోవడం గొప్ప విషయం అంటూ కార్యాలయం వదిలి వెళ్లారు.

# లింక్ రోడ్లకు మహర్దశ

## తాడికొండలో రూ.4.5 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

## దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణకు ప్రాధాన్యం: పెమ్మసాని



గుంటూరు(ప్రశ్న న్యూస్) గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. తాడికొండ నియోజకవర్గంలో రూ.4.5 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి శ్రీకారం చుట్టారు.

### దెబ్బతిన్న లింక్ రోడ్లపై దృష్టి

వేములూరుపాడు, గరుడ, చలపాలెం, డోకిపర్రు తదితర గ్రామాల్లో రహదారి అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రధాన రహదారులు కొంతమేర మెరుగ్గా ఉన్నప్పటికీ, గ్రామాలను ప్రధాన రహదారులతో అనుసంధానించే లింక్ రోడ్లు దెబ్బతిన్న సమస్యను ప్రభుత్వం గుర్తించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల రోజువారీ రాకపోకలు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర సేవలకు లింక్ రోడ్లు కీలకమని పేర్కొన్నారు. దెబ్బతిన్న రహదారులను దశలవారీగా పునరుద్ధరించడంతో పాటు అవసరమైన చోట కొత్త రహదారి పనులను చేపడుతున్నామని తెలిపారు.

### గ్రామాల వారీగా డీపీఆర్‌లు

తాడికొండ నియోజకవర్గంలో అవసరమైన రహదారి పనులపై గ్రామాల వారీగా డీపీఆర్‌లు (వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలు) సిద్ధం చేసి ప్రభుత్వ స్థాయిలో నిరంతరం అనుసరిస్తున్నామని పెమ్మసాని తెలిపారు. నియోజకవర్గంలోని రహదారి సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ చేస్తున్న కృషిని అభినందించారు.ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందని డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

# ఎత్తిపోతల పథకాలకు పునర్జీవం

## 18,220 ఎకరాలకు సాగునీటి భరోసా

## రూ.8.65 కోట్లతో పునరుద్ధరణ, ఆధునీకరణ పనులు

## 14 పథకాలతో 15 వేల మందికి పైగా రైతులకు ప్రయోజనం

## కొండపేటకు రూ.3.77 కోట్లు.. మదనగోపాలసాగరానికి రూ.4.10 కోట్లు




కోటబొమ్మాళి(ప్రశ్న న్యూస్) సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతుల పొలాలకు ఎత్తిపోతల పథకాలు మళ్లీ జీవకళను సంతరించుకుంటున్నాయి. ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైన పథకాలను పునరుద్ధరించడంతో పాటు ఆధునీకరించి చివరి ఎకరం వరకు నీటిని అందించడమే లక్ష్యంగా పనులు ముందుకు సాగుతున్నాయి.

టెక్కలి నియోజకవర్గంలో 14 ఎత్తిపోతల పథకాల పరిధిలోని 18,220 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేలా రూ.8.65 కోట్లతో ప్రభుత్వం వివిధ పనులు చేపట్టింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్వీర్యమైన పథకాలను గుర్తించి పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గతంలో విద్యుత్ పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి సామగ్రి, ఇతర యంత్ర పరికరాలు చోరీకి గురికావడంతో పలు ఎత్తిపోతల పథకాలు పనిచేయకుండా పోయాయని పేర్కొన్నారు. దీంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు.

### అధికారంలోకి రాగానే రూ.78 లక్షలు

2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎత్తిపోతల పథకాల సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి తెలిపారు. తక్షణ మరమ్మతులు, అవసరమైన పరికరాల ఏర్పాటుకు రూ.78 లక్షలు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. దీంతో నిలిచిపోయిన పథకాలను తిరిగి వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు.కేవలం మరమ్మతులతో సమస్యకు పరిష్కారం లభించదనే ఉద్దేశంతో పథకాలను ఆధునీకరించేందుకు తదుపరి దశలో నిధులు కేటాయించినట్లు చెప్పారు.

### మరో రూ.7.87 కోట్లతో ఆధునీకరణ

ఎత్తిపోతల పథకాల సామర్థ్యాన్ని పెంచేందుకు 2026లో మరో రూ.7.87 కోట్లను మంజూరు చేయించినట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. ఇందులో కోటబొమ్మాళి మండలంలోని కొండపేట ఎత్తిపోతల పథకానికి రూ.3.77 కోట్లు, టెక్కలి మండలంలోని మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకానికి రూ.4.10 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.ఈ నిధులతో నూతన పైప్‌లైన్ల నిర్మాణం, అవసరమైన యంత్ర పరికరాల ఏర్పాటు, పథకాల ఆధునీకరణ, ఆయకట్టుకు నీటిని సమర్థంగా తరలించే పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

### 14 పథకాలు.. 18,220 ఎకరాలు

టెక్కలి నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాల కింద భారీ ఆయకట్టు ఉందని మంత్రి తెలిపారు.
కోటబొమ్మాళి మండలం: 11 పథకాలు - 13,650 ఎకరాలు
టెక్కలి మండలం: 2 పథకాలు - 4,100 ఎకరాలు
నందిగాం మండలం: 1 పథకం - 470 ఎకరాలు
మొత్తంగా 14 ఎత్తిపోతల పథకాల కింద 18,220 ఎకరాల ఆయకట్టు ఉందని, వీటి ద్వారా 15 వేల మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉందని తెలిపారు.

### చివరి ఎకరాకూ నీరు

ఎత్తిపోతల పథకాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వరితో పాటు మొక్కజొన్న, రాగి, వేరుశనగ, కూరగాయలు, ఇతర వాణిజ్య పంటల సాగుకు నీటి భరోసా పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. సాగునీటి వసతులు మెరుగుపడితే పంటల సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు రైతులకు ఆదాయ అవకాశాలు కూడా మెరుగుపడతాయని తెలిపారు.

## మైదుకూరు అభివృద్ధికి వేగం..

# గడువు దాటితే ఉపేక్షించం

## తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యంపై కలెక్టర్ దృష్టి

## అమృత్-2.0 పనులు వేగవంతం చేయాలి

## గుంతలు పూడ్చాలి.. మురుగు కాలువల్లో పూడిక తొలగించాలి

## ప్రభుత్వ పథకాల ఫలాలు ప్రజలకు నేరుగా అందాలి: ఎమ్మెల్యే



కడప(ప్రశ్న న్యూస్) మైదుకూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా తాగునీరు, రహదారులు, మురుగు కాలువలు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సూచించారు.కలెక్టరేట్లో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన మైదుకూరు మున్సిపాలిటీ అభివృద్ధి పురోగతిపై సమీక్ష నిర్వహించారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు ప్రజెంటేషన్ ద్వారా వివరాలు అందించారు.

### బోర్లపైనే ఆధారం.. శాశ్వత నీటి వనరు ఎక్కడ.?

మైదుకూరు పట్టణంలో ప్రస్తుతం భూగర్భ జలాల ఆధారంగానే తాగునీటి సరఫరా జరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత నీటి వనరులను అభివృద్ధి చేయాలని కలెక్టర్ సూచించారు.అమృత్-2.0 కింద చేపడుతున్న తాగునీటి పథకాల పురోగతిని సమీక్షించారు. పైపులైన్ల ఏర్పాటు, నీటి నిల్వ ట్యాంకులు, నీటి శుద్ధి కేంద్రం తదితర పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.ప్రస్తుతం బోరు బావుల ద్వారా రోజుకు సుమారు 3.65 మిలియన్ లీటర్ల నీరు సరఫరా అవుతోందని అధికారులు వివరించారు. పట్టణ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ, శాశ్వత నీటి వనరులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు.

### గుంతలకు శాశ్వత పరిష్కారం

మున్సిపాలిటీ పరిధిలోని రహదారుల పరిస్థితిపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. గుంతలను పూడ్చడంతో పాటు వివిధ నిధులతో చేపడుతున్న రహదారి అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోకుండా మురుగు కాలువల్లో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. డ్రైనేజీ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

### చెత్త నిర్వహణపై ప్రత్యేక నిఘా..

పట్టణ పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వద్దని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ, తడి--పొడి చెత్త వేరు చేయడం, చెత్త తరలింపు, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ వంటి అంశాలపై సమీక్షించారు.స్వచ్ఛ భారత్ మిషన్ కింద చేపడుతున్న పనులు కాగితాలకే పరిమితం కాకుండా ప్రజలకు ప్రత్యక్షంగా కనిపించేలా ఉండాలని సూచించారు. పాత చెత్త తొలగింపు, వ్యర్థాల శుద్ధి, భూమి పునరుద్ధరణ వంటి పనులను ప్రాధాన్యంతో పూర్తి చేయాలని ఆదేశించారు.

### తాగునీరు పుష్కలంగా ఉండాలి..

రహదారులు మెరుగుపడాలి.. మురుగు కాలువలు సక్రమంగా పనిచేయాలి.. పట్టణం పరిశుభ్రంగా ఉండాలి అనే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో స్పష్టం చేశారు.

# మౌనం వీడండి.. సమాచారం ఇవ్వండి

## మాదకద్రవ్యాలపై ప్రజా ఉద్యమంగా 'బ్రేక్ ద సైలెన్స్'

## డ్రగ్స్ సమాచారం 1972కు.. వివరాలు గోప్యంగా

## గంజాయి సాగు నుంచి రవాణా, సరఫరా వ్యవస్థపై ఈగల్ నిఘా



మంగళగిరి(ప్రశ్న న్యూస్) మాదకద్రవ్యాల మహమ్మారిని అడ్డుకోవడంలో పోలీసు చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యమూ కీలకమే. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా గురించి సమాచారం తెలిసినా చాలామంది భయంతో మౌనం వహిస్తుంటారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ఏపీ ఈగల్ చేపట్టిన 'బ్రేక్ ద సైలెన్స్-మౌనం వీడి సమాచారం ఇవ్వండి' కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా విస్తరించాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే ప్రజలు ఎలాంటి భయసంకోచాలు లేకుండా 1972 డ్రగ్స్ హెల్ప్‌లైన్‌కు తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

మంగళగిరిలోని ఏపీ ఈగల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హోంమంత్రి మాట్లాడారు. ఈగల్ చీఫ్ ఐజీపీ ఆకే రవికృష్ణతో కలిసి సంస్థ ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, సాధించిన పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై వివరాలు వెల్లడించారు.

### సాగు నుంచి సరఫరా వరకు..

గత 21 నెలల్లో ఏపీ ఈగల్ పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన శాఖలతో సమన్వయంతో పనిచేస్తూ ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగును తగ్గించేందుకు చర్యలు చేపట్టిందని హోంమంత్రి తెలిపారు.గంజాయి సాగుకు ప్రత్యామ్నాయంగా అధిక విలువ కలిగిన ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తూ రైతులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించే కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందన్నారు. ఇకపై సాగును అడ్డుకోవడంతో పాటు గంజాయి రవాణా, పంపిణీ నెట్‌వర్క్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.మాదకద్రవ్యాల నిర్మూలనలో పోలీసుల నిఘా ఒకవైపు.. ప్రజల అప్రమత్తత మరోవైపు. మౌనం వీడి సమాచారం అందిస్తేనే సరఫరా గొలుసును అడ్డుకోవచ్చన్నదే 'బ్రేక్ ద సైలెన్స్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

# కల్తీ ఆహారంపై కొరడా

**- హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార తయారీ కేంద్రాల్లో ముమ్మర తనిఖీలు**
**- పన్నీర్, పాల ఉత్పత్తులు, వంట నూనెల నాణ్యతపై ప్రత్యేక దృష్టి**
**- అనుమానాస్పద ఆహార పదార్థాల నమూనాల సేకరణ..**
**- ప్రయోగశాలకు తరలింపు**
**- నివేదిక ఆధారంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు**





కడప(ప్రశ్న న్యూస్) ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే కల్తీ, నాసిరకం ఆహార విక్రయదారులపై చర్యలకు ఫుడ్ సేఫ్టీ అధికారులు సిద్ధమయ్యారు. కడప నగరంలో హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార తయారీ కేంద్రాలు, పంపిణీ కేంద్రాలతో పాటు పన్నీర్, పాల ఉత్పత్తుల కేంద్రాల్లో శుక్రవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. వంటశాలల పరిశుభ్రత నుంచి ఆహార పదార్థాల నిల్వ, గడువు తేదీలు, వంట నూనెల నాణ్యత వరకు పలు అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి డాక్టర్ హరిత, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఓ.వి. రాముడు ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగాయి. ముఖ్యంగా ప్రజలు నిత్యం వినియోగించే పాలు, పన్నీర్, ఇతర పాల ఉత్పత్తులతో పాటు హోటళ్లలో ఉపయోగిస్తున్న వంట నూనెల నాణ్యతపై అధికారులు దృష్టి సారించారు.

### వంటగది నుంచి నిల్వ గదివరకు..

హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహారం తయారు చేసే ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. వంటశాలల్లో పరిశుభ్రత పరిస్థితులు, సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత, ముడి పదార్థాల నాణ్యత, ఆహార పదార్థాలను నిల్వ చేసే విధానం, నిల్వ ఉష్ణోగ్రతలు తదితర అంశాలను తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు నేలపై లేదా అపరిశుభ్రమైన ప్రదేశాల్లో నిల్వ చేస్తున్నారా? ముడి పదార్థాలు, తయారైన ఆహారాన్ని వేర్వేరుగా భద్రపరుస్తున్నారా? గడువు ముగిసిన పదార్థాలను వినియోగిస్తున్నారా? అనే అంశాలపై అధికారులు ఆరా తీశారు.

### పన్నీర్‌పై ప్రత్యేక నిఘా

పన్నీర్, పాలు, ఇతర పాల ఉత్పత్తుల నాణ్యతను అధికారులు ప్రత్యేకంగా పరిశీలించారు. అనుమానాస్పదంగా ఉన్న కొన్ని ఆహార పదార్థాల నుంచి నమూనాలను సేకరించారు. వాటిని నాణ్యతా ప్రమాణాల నిర్ధారణ కోసం ఆహార పరిశోధన ప్రయోగశాలకు పంపినట్లు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి డాక్టర్ హరిత తెలిపారు. ప్రయోగశాల నివేదికలు వచ్చిన అనంతరం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. దీంతో నమూనాల నివేదికలపై సంబంధిత వ్యాపార వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

### నివేదిక వస్తే చర్యలు తప్పవు

ఆహార పదార్థాలు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేవని ప్రయోగశాల పరీక్షల్లో తేలితే సంబంధిత యాజమాన్యాలపై ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006 ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. కల్తీ లేదా నాసిరకం ఆహారాన్ని విక్రయించి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే వారిని ఉపేక్షించబోమని తెలిపారు. తనిఖీలు కేవలం దాడులు, కేసులకే పరిమితం కాదని.. ఆహార వ్యాపార నిర్వాహకుల్లో పరిశుభ్రత, నాణ్యత, ఆహార భద్రతపై అవగాహన పెంచడం కూడా లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

### నిబంధనలు పాటించాల్సిందే

హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార తయారీ, పంపిణీ కేంద్రాల నిర్వాహకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఫుడ్ సేఫ్టీ అధికారులు సూచించారు. వంటశాలలు, నిల్వ గదులను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన ముడి పదార్థాలను మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. ఆహార పదార్థాల నాణ్యతపై అనుమానం ఉన్నా, కల్తీ ఆహారం విక్రయిస్తున్నట్లు గుర్తించినా ప్రజలు అధికారులకు సమాచారం అందించాలని డాక్టర్ హరిత సూచించారు. ఇందుకోసం 104 / 1967 హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

### తనిఖీలు కొనసాగుతాయి

కడప నగరంతో పాటు జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార తయారీ, పంపిణీ కేంద్రాలపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని డాక్టర్ హరిత, ఓ.వి. రాముడు తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందేలా ఫుడ్ సేఫ్టీ విభాగం చర్యలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ రెండోరోజూ సర్వే

**- 388 ఎకరాలపై అధికారుల దృష్టి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారుల భూ సర్వే రెండో రోజూ కొనసాగింది. సిద్దిపేట జిల్లా మార్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలోని ఫామ్‌హౌస్‌ను ఆనుకొని ఉన్న భూములను అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎర్రవల్లి, వెంకటాపూర్, వరదరాజపూర్ గ్రామాల సరిహద్దుల్లో విస్తరించి ఉన్న సర్వే నంబర్ 325లోని 388 ఎకరాల భూములపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. గురువారం ఈ మూడు గ్రామాల సరిహద్దులను గుర్తించిన బృందాలు, రెండో రోజైన శుక్రవారం ఆ భూములకు సంబంధించిన పాత రైతుల వివరాలను, ప్రస్తుత రెవెన్యూ రికార్డులను సేకరించాయి. ఏడీ సుదర్శన్ రాథోడ్, డీఐ సేవియా నాయక్ పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక బృందాలు ఈ సర్వే ప్రక్రియను నిర్వహించాయి. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారం, రెవెన్యూ రికార్డుల ఆధారంగా అధికారులు సమగ్ర నివేదికను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. అయితే, ఈ సర్వే చేపట్టడానికి గల కచ్చితమైన కారణాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

## జర్నలిస్ట్ ల "గూడు " కోసం పోరాడండి



వార్త మల్లేష్ , సీనియర్ జర్నలిస్ట్, 9948098162

వాళ్ళు వేల ఎకరాలు.. వీళ్ళు వందల ఎకరాలు.. వాళ్ళు వేల కోట్లు.. వీళ్ళు వందల కోట్లు..వీళ్ళ గూర్చి వార్తలు రాసి, వేసిన వాళ్ళ "కలం " కార్మికుల కు కనీసం "వంద " గజాల ఇల్లు కూడా ఇవ్వలేక పోయారు. తెలంగాణ వచ్చింది ఎందుకు.? ఎందుకు మూగబోతున్నాయి జర్నలిస్ట్ ల సంఘాలు. ఇప్పుడు ఐనా నోరు ఇప్పవా.? మీకు విల్లలు, ఫ్లాట్స్ వస్తే సరిపోద్దా.. మమ్ముల్ని ముంగట పెట్టుకొని మీరు యూనియన్ ల పేరు తో ఎంత వెనక ఏసుకున్నారో కూడా ఎవడో ఒకడు రేపు బయట పెడ్తాడు. కర్మ విల్ బ్యాక్.. ఇప్పుడు ఐనా ఐక్యత గా జర్నలిస్ట్ ల "గూడు " కోసం పోరాడండి. వాళ్ళు కబ్జా లు చేసిన.. చేసుకుంటున్న దాంట్లో ఒక 10 శాతం జర్నలిస్ట్ లకి ఇవ్వండి అని కొట్లాడే దమ్ము లేదా జర్నలిస్ట్ యూనియన్ లకి ఇప్పుడు ఐనా నోరు విప్పండి. తెలంగాణ ఉద్యమం లో కీలక పాత్ర పోషించిన అభాగ్య జర్నలిస్ట్ ల కోసం నోరు విప్పండి. లేదా రేపటి నుండి ఎవరో ఒకరు మీ ఆస్తుల చిట్టా విప్పుతారు. దయచేసి అడగండి మీకు వేల ఎకరాలు.? మాకు వంద గజాలు ఇవ్వలేరా.? యూనియన్ లు పోరాడాలి ఇది సరైన సమయం

# రాధే.. కృష్ణ ప్రేమకు ప్రతిరూపం

**- నేడు రాధాష్టమి.. భక్తి, ప్రేమ, ఆధ్యాత్మికతల సంగమ పర్వం**
**- రాధమ్మ తత్త్వమే కృష్ణ తత్త్వానికి పరిపూర్ణత - వ్రజభూమిలో వెల్లివిరిసే భక్తి వైభవం**

**(తోట వెంకట్ - ఆంధ్రప్రదేశ్ "ప్రజాప్రశ్న" బ్యూరో, ప్రత్యేక కథనం)**



గోకులం నుంచి గోవర్ధనం వరకు.. యమునా తీరాల నుంచి దేశంలోని కృష్ణక్షేత్రాల వరకు.. నేడు రాధానామ స్మరణతో భక్తి పరవళ్లు తొక్కనుంది. భాద్రపద శుక్లపక్ష అష్టమి.. వైష్ణవ సంప్రదాయంలో అత్యంత విశిష్టమైన రోజు. ఇదే రాధాష్టమి. శ్రీకృష్ణుడి జన్మాష్టమి ఎంత వైభవంగా నిర్వహిస్తారో.. రాధాదేవి జన్మదినమైన రాధాష్టమిని సైతం అంతే భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. రాధా-కృష్ణుల అనుబంధాన్ని కేవలం ప్రేమకు ప్రతీకగా కాకుండా.. భక్తుడు-భగవంతుడి మధ్య ఉన్న ఆత్మీయ బంధానికి ప్రతిరూపంగా భక్తులు భావిస్తారు.

### అష్టమి.. ఓ అపురూపమైన పర్వదినం

భాద్రపద శుక్లపక్ష అష్టమి రోజున రాధాదేవి అవతరించిందని పురాణ, వైష్ణవ సంప్రదాయాల్లో విశ్వాసం. అందుకే ఈ రోజును రాధాష్టమిగా పిలుస్తారు. శ్రీకృష్ణ జన్మాష్టమి అనంతరం వచ్చే రాధాష్టమికి ఉత్తర భారతదేశంలోని వ్రజ ప్రాంతంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. రాధాదేవి జన్మస్థలంగా బర్సానాను భక్తులు విశ్వసిస్తారు. అక్కడ రాధాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఆలయాలు పుష్పాలతో అలంకరించబడతాయి. రాధారాణి విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు. మంగళహారతులు, భజనలు, కీర్తనలు, సంకీర్తనలతో పరిసరాలు మార్మోగుతాయి.

### రాధ.. ఒక పేరు కాదు.. ఓ భావన

రాధ అనే పేరు వినగానే కృష్ణుడు గుర్తుకొస్తాడు. కృష్ణుడి పేరు పలికితే రాధ గుర్తుకు వస్తుంది. ఈ అనుబంధం వెనుక ఉన్న ఆధ్యాత్మిక భావనను వైష్ణవ సంప్రదాయం ఎంతో ఉన్నతంగా వివరిస్తుంది.రాధాదేవిని నిష్కల్మషమైన భక్తికి ప్రతిరూపంగా భావిస్తారు. భగవంతుడి నుంచి ఏదీ ఆశించకుండా ఆయనను ప్రేమించడం.. ఆయన సంతోషంలోనే తన ఆనందాన్ని వెతుక్కోవడం.. తనను తాను పూర్తిగా భగవంతుడికి సమర్పించుకోవడం.. రాధా తత్త్వంలోని ప్రధాన సందేశంగా భక్తులు చెబుతారు. అందుకే రాధ-కృష్ణుల కథను కేవలం ప్రాపంచిక ప్రేమకథగా చూడకుండా.. జీవాత్మ-పరమాత్మల అనుబంధానికి ప్రతీకగా ఆధ్యాత్మిక సంప్రదాయాలు వివరిస్తాయి.

### వేణుగానం వినిపిస్తే..

యమునా తీరం.. కదంబ వృక్షాల నీడ.. గోపికల మధ్య కృష్ణుడి వేణుగానం.. ఆ సంగీతానికి పరవశించే వ్రజభూమి.. ఆ దృశ్యంలో రాధాదేవి స్థానం ప్రత్యేకం. కృష్ణుడి వేణునాదం భౌతికమైన సంగీతం కాదని భక్తులు భావిస్తారు. అది ఆత్మను పరమాత్మ వైపు నడిపించే పిలుపుగా భావిస్తారు. రాధకు కృష్ణుడిపై ఉన్న భక్తి కూడా అదే పరమానురాగానికి ప్రతిరూపంగా చెబుతారు.

### కృష్ణుడి వేణువు పిలుపైతే.. రాధ హృదయం ఆ పిలుపుకు స్పందించే భక్తి.

అందుకే రాధా-కృష్ణుల అనుబంధం తరతరాలుగా భారతీయ భక్తి సాహిత్యాన్ని ప్రభావితం చేసింది. జయదేవుడి గీతగోవిందం నుంచి అనేక భక్తి కీర్తనల వరకు రాధా-కృష్ణుల ప్రేమ, విరహం, అనురాగం, సమర్పణ ప్రధాన అంశాలుగా నిలిచాయి.

### విరహంలోనూ భక్తి..

రాధా తత్త్వంలో మరో ముఖ్యమైన అంశం విరహభక్తి. భగవంతుడు తనకు దూరంగా ఉన్నాడనే భావనలోనూ ఆయనను మరింతగా స్మరించడం.. ఆయన సాన్నిధ్యాన్ని ప్రతి క్షణం అనుభవించడం.. భక్తి తీవ్రతను పెంచుకోవడం.. రాధాభక్తిలో కనిపించే విశిష్టతగా భావిస్తారు. అందుకే రాధను కేవలం కృష్ణుడి ప్రియురాలిగా మాత్రమే కాకుండా.. కృష్ణభక్తికి అత్యున్నత ప్రతిరూపంగా వైష్ణవ సంప్రదాయం గౌరవిస్తుంది.

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రాధాష్టమి సందర్భంగా దేశవ్యాప్తంగా కృష్ణాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాధాకృష్ణుల ఉత్సవమూర్తులకు అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు చేస్తారు. పుష్పాలతో ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తారు.కొన్ని ప్రాంతాల్లో రాధాదేవికి ప్రత్యేకంగా షోడశోపచార పూజలు, నైవేద్యాలు, హారతులు నిర్వహిస్తారు. భక్తులు ఉపవాసం పాటించి రాధానామ స్మరణ చేస్తారు. ఆలయాల్లో భజనలు, హరినామ సంకీర్తనలు జరుగుతాయి.రాధాష్టమి రోజున రాధాకృష్ణుల దర్శనం చేసుకుంటే మనసులోని కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. అయితే ఈ పర్వదినం అసలు సందేశం కోరికల సాధనకంటే భక్తి, ప్రేమ, సమర్పణ అని ఆధ్యాత్మికవేత్తలు చెబుతారు.

### పుష్పాలతో రాధారాణి అలంకరణ

రాధాష్టమి వేడుకల్లో పుష్పాలంకరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. మల్లెలు, గులాబీలు, చామంతులు, తామరలు తదితర పుష్పాలతో రాధాకృష్ణుల ఆలయాలను అలంకరిస్తారు. రాధారాణిని పసుపు, ఎరుపు, గులాబీ రంగుల పుష్పాలతో అలంకరించి.. పట్టు వస్త్రాలు, ఆభరణాలు ధరింపజేసి భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఆలయంలో వెలిగే దీపాలు.. పుష్పాల పరిమళం.. వినిపించే భజనలు.. భక్తుల రాధానామ స్మరణ.. ఇవన్నీ కలసి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టిస్తాయి.



### రాధా నామస్మరణతో పులకించే వ్రజం

బర్సానా, వృందావనం, మథుర ప్రాంతాల్లో రాధాష్టమి రోజున ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. వేలాది మంది భక్తులు ఈ వేడుకలకు హాజరవుతారు. రాధారాణి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ కనిపిస్తుంది. ఆలయ ప్రాంగణాలు రాధే.. రాధే.. అనే నామస్మరణతో మార్మోగుతాయి. భక్తులు రాధారాణి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కొందరు భక్తులు వ్రజ పరిక్రమణ చేస్తారు. రాధాకృష్ణుల లీలాక్షేత్రాలను దర్శించుకోవడం ద్వారా తమ జీవితంలో ఆధ్యాత్మిక అనుభూతిని పొందుతున్నామని వారు భావిస్తారు.

### భక్తికి భాష అవసరం లేదు

రాధా-కృష్ణుల కథకు కాలంతో సంబంధం లేదు. తరాలు మారినా ఆ అనుబంధంపై భక్తుల విశ్వాసం మారలేదు. ఎందుకంటే రాధా తత్త్వం ఒక ప్రత్యేకమైన సందేశాన్ని అందిస్తుంది. ప్రేమలో స్వార్థం ఉండకూడదు.. భక్తిలో ప్రతిఫలం ఆశించకూడదు.. సమర్పణలో షరతులు ఉండకూడదు.

### రాధాభక్తి చెప్పే గొప్ప సందేశం ఇదే.

మనిషి తన జీవితంలో ఎన్ని విజయాలు సాధించినా.. అంతరంగంలో ప్రశాంతత లేకపోతే ఆ విజయాలకు పరిపూర్ణత ఉండదు. భగవంతుడిపై విశ్వాసం, ఇతరులపై ప్రేమ, మనసులో స్వచ్ఛత ఉంటేనే జీవితం సంపూర్ణమవుతుందని రాధా తత్త్వం గుర్తుచేస్తుంది.

### రాధ లేకుండా కృష్ణుడు.. కృష్ణుడు లేకుండా రాధ!

భారతీయ భక్తి సంప్రదాయంలో రాధా-కృష్ణులు విడదీయరాని జంటగా నిలిచారు. కృష్ణుడి చిలిపితనం వెనుక రాధాభక్తి కనిపిస్తుంది. రాధా విరహంలో కృష్ణస్మరణ కనిపిస్తుంది. ఇద్దరి కథలో ప్రేమ ఉంది.. భక్తి ఉంది.. విరహం ఉంది.. ఆనందం ఉంది.. ఆధ్యాత్మికత ఉంది.

అందుకే రాధాష్టమి ఒక పుట్టినరోజు వేడుక మాత్రమే కాదు.
మనసులోని ప్రేమను పవిత్రం చేసుకునే రోజు..
భక్తిలోని స్వార్థాన్ని తొలగించుకునే రోజు..
భగవంతుడిపై విశ్వాసాన్ని మరింత బలపరుచుకునే రోజు..
రాధా తత్త్వాన్ని మన జీవితంలో ఆచరించుకునే రోజు.
రాధే.. రాధే.. అంటూ భక్తులు నామస్మరణ చేస్తుంటే.. వ్రజభూమి మరోసారి కృష్ణవేణుగానాన్ని తలపిస్తుంది. రాధారాణి చిరునవ్వులో భక్తికి కొత్త అర్థం కనిపిస్తుంది.
అందుకే రాధాష్టమి.. ఓ పర్వదినం మాత్రమే కాదు.. ప్రేమను భక్తిగా.. భక్తిని సమర్పణగా మార్చే ఆధ్యాత్మిక సందేశం.

# గరుడసేవకు గొడుగులు

**చెన్నై నుంచి తిరుమలకు చేరిన 9 గొడుగులు..**

**22వసారి సమర్పణ**



తిరుమల(ప్రశ్న న్యూస్) శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే గరుడసేవకు చెన్నైకు చెందిన హిందూ ధర్మార్థ సమితి తరఫున 9 గొడుగులు శుక్రవారం తిరుమలకు చేరాయి. సమితి ట్రస్టీ ఆర్.ఆర్. గోపాల్‌జీ ఈ గొడుగులను టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరికి అందజేశారు.22వసారి సమర్పణశ్రీవారి గరుడసేవ సందర్భంగా గొడుగులను సమర్పించడం తమ సంస్థకు సంప్రదాయంగా వస్తోందని, ఈ ఏడాది వరుసగా 22వసారి గొడుగులను సమర్పించినట్లు తెలిపారు. గరుడసేవలో స్వామివారి ఊరేగింపులో ఈ గొడుగులను వినియోగించనున్నారు.ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588